







# రబీకి సాగు నీరు అందేనా..?

**నీటి లభ్యతను పరిగణలోకి తీసుకొని కేసీ కాలువ పరిధిలో రబీ సాగుకు నీరు విడుదలపై ప్రభుత్వం నిర్ణయం ప్రకటించాలి..! డిసెంబరు 10న జరిగిన సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశంలో చేసిన తీర్మానం ఇది. రబీ సాగులో భాగంగా ఇప్పటికే రైతులు వరినాట్లు ప్రారంభించారు. సాగునీరు ఇస్తున్నారా..? ఇస్తే ఎన్ని ఎకరాలకు ఇస్తున్నారు..? ఇందులో స్పష్టత లేదు. తుంగభద్ర డ్యాంలో 7.05 టీఎంసీలు కేసీ వాటా మిగులు ఉంది. ప్రభుత్వ అనుమతితో టీబీ డ్యాం నుంచి 2 వేల క్యూసెక్కులు విడుదల చేసినా సుంకేసులకు చేరలేదు. దీంతో సుంకేసుల జలాశయం 0.55 టీఎంసీలకు పడిపోయింది. రబీ సాగుపై స్పష్టత ఇవ్వాలని కేసీ ఆయకట్టు రైతులు కోరుతున్నారు.**



కేసీ కాలువ కింద వరి నాట్లు

**కర్నూలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో కేసీ కాలువ పరిధిలో 90 వేల ఎకరాలు రబీ ఆయకట్టు ఉంది. కేడబ్ల్యూడీటీ అవార్డు (జస్టిస్ బచావత్ అవార్డు)-1 ప్రకారం 31.90 టీఎంసీలు నికర జలాలు కేటాయించారు. అందులో 10 టీఎంసీలు తుంగభద్ర డ్యాం నుంచి తీసుకోవాల్సి ఉంది. 21.90 టీఎంసీలు సుంకేసుల జలాశయం నుంచి నది ప్రవాహం ద్వారా తీసుకునేలా డిజైన్ చేశారు. కేసీ ఆయకట్టు రైతుల జీవనాధారమైన సుంకేసుల జలాశయం నీటి నిల్వ సామర్థ్యం కేవలం 1.20 టీఎంసీలు మాత్రమే కావడంతో నదీప్రవాహ నీటిపై ఆధార పడాల్సి వస్తున్నది. అయితే.. ఏటేటా తుంగభద్రలో నీటి ప్రవాహం తగ్గిపోతుండడంతో రబీ సాగుకు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో కేసీ ఆయకట్టుకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా 'ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం' నుంచి వెయ్యి క్యూసెక్కులు తీసుకునేలా నాలుగు పంపులు ఏర్పాటు చేశారు. శ్రీశైలం జలాశయం నీటిపై స్పష్టమైన విధానం లేకపోవడంతో రబీకి సాగునీటి విడుదలపై ఇంజనీర్లు స్పష్టమైన హామీ ఇవ్వలేకపోతున్నారు. తుంగభద్ర డ్యాంలో కేసీ నీటి వాటా సకాలంలో వినియోగించుకోలేని పరిస్థితి ఉంది. ఆ నీటిని అవసరమైన మేరకు వినియోగించుకుంటే రైతులు సాగునీటి ఇబ్బందులు రాకుండా నీరు ఇవ్వవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.



కేసీ కాలువ

- కేసీ కాలువ కింద రబీ ఆయకట్టు 90 వేల ఎకరాలు
- 0.55 టీఎంసీలకు పడిపోయిన సుంకేసుల జలాశయం
- తుంగభద్ర డ్యాంలో కేసీ వాటా 7.05 టీఎంసీలు మిగులు
- టీబీ డ్యాం నుంచి 2 వేల క్యూసెక్కులు విడుదల

## తుంగభద్ర జలాశయమే ఆధారం

కేసీ కెనాల్ నీటివాటా తుంగభద్ర డ్యాంలో 7.05 టీఎంసీలు మిగులు ఉన్నాయి. డ్యాం నుంచి నీటిని తీసుకోవాలంటే 225 కిలో మీటర్లు నదిలో ప్రవహించి సుంకేసుల బ్యారేజీకి చేరాల్సి ఉంది. ఎగువన నదీతీరంలో వివిధ ఎత్తిపోతల పథకాలు, ఆయా గ్రామాల రైతులు నీటిని వినియోగించుకుంటారు. అలాగే.. ఆర్డీఎస్ ఆనకట్ట దాటి దిగువకు ప్రవహించాలి. అంటే.. వాటా నీటిలో 45-55 శాతం కూడా సుంకేసులకు చేరే అవకాశం లేదని ఇంజనీర్లు అంటున్నారు. అదే క్రమంలో టీబీ డ్యాం నుంచి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు కూడా ఆర్డీఎస్ ఎడమ కాలువ నీటివాటాను నదీ ద్వారా తీసుకుంటున్నారు. ప్రస్తుతం తెలంగాణ వాటా 2 వేల క్యూసెక్కులు. కర్ణాటక వాటా 125 క్యూసెక్కులు టీబీ డ్యాం నుంచి తీసుకుంటున్నారు. ఆ రాష్ట్రాలతో పాటే కేసీ కాలువ నీటివాటాను కూడా తీసుకుంటే నదీ ప్రవాహంలో నీటి నష్టం (వాటర్ లాస్) తక్కువగా ఉంటుందని, మనం ఇచ్చే ఇండెంట్‌లో 65-70 శాతం నీరు సుంకేసుల డ్యాంకు చేరుతుందని సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు. తెలంగాణ, కర్ణాటక వాటాతో కలసి కాకుండా ఏపీ వాటా నీటిని ఒక్కటే తీసుకుంటే ఆర్డీఎస్ ఆనకట్ట దాటి నీరు దిగువకు రావడమే కష్టమని అంటున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఆర్డీఎస్ వాటాగా వెయ్యి క్యూసెక్కులు, కేసీ కెనాల్ వాటాగా ఏపీ 2 వేలు క్యూసెక్కులు ఇండెంట్ మేరకు తుంగభద్ర డ్యాం నుంచి విడుదల చేస్తున్నారు. శనివారం సుంకేసులకు దాదాపు వెయ్యి క్యూసెక్కులు చేరుతుందని, ఒకటి రెండు రోజుల్లో కేసీ కాలువకు నీటిని విడుదల చేస్తామని ఇంజనీర్లు అంటున్నారు.

### అడుగంటిన సుంకేసుల బ్యారేజీ

తుంగభద్ర జలాశయం నుంచి కేసీ కాలువకు 10 టీఎంసీల నీటివాటా ఉంది. ఆ ఏడాది టీబీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ 9.05 టీఎంసీలు కేటాయించింది. బోర్డు నిబంధనలు మేరకు అక్టోబరు ఆఖరిలోగా 2 టీఎంసీలు వినియోగించుకోవాలి. తుంగభద్రలో వరద ప్రవాహం ఉండడంతో ఆ నీటిని వినియోగించుకోకపోవడం వల్ల హెచ్చెల్సీ కాలువ ద్వారా అనంతపురం జిల్లాకు మళ్లించారు. ప్రస్తుతం టీబీ డ్యాంలో కేసీ వాటాగా 7.05 టీఎంసీలు ఉన్నాయి. సుంకేసుల బ్యారేజీ నుంచి కేసీ కాలువ 0.00 నుంచి 234.64 కిలోమీటర్ల వరకు ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో, 234.64 కి.మీల నుంచి 305.65 కిలోమీటర్ల వరకు (71.01 కి.మీలు) కడప జిల్లాలో ప్రవహిస్తుంది. 0/0 నుంచి 32 కి.మీలు వరకు 3,763 ఎకరాలు ఆయకట్టు ఉంది. కేవలం సుంకేసుల డ్యాం నుంచి మాత్రమే నీరు ని తీసుకుంటే తప్ప సాగునీరు ఇవ్వలేం. ఆ తరువాత మాల్యాల లిఫ్టు, ముచ్చుమర్రి లిఫ్టు నుంచి కృష్ణా జలాలు తీసుకునే అవకాశం ఉన్నా.. కేఆర్ఎంబీ కేటాయింపులపై ఆధారపడి ఉంటుంది. దీంతో సుంకేసులు డ్యాం నుంచి 2,400 క్యూసెక్కులు కేసీ కాలువకు విడుదల చేస్తే కడప జిల్లాలో కూడా ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు ఇవ్వవచ్చు. అయితే.. సుంకేసులు బ్యారేజీ అడుగంటుతోంది. ప్రస్తుతం కేవలం 0.55 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది.



సుంకేసుల జలాశయం

### కేసీ ఆయకట్టుకు సాగునీరు ఇస్తాం

కేసీ కాలువ కింద రబీలో సాగు చేసిన పంటలకు సాగునీరు ఇస్తాం. తుంగభద్ర డ్యాంలో కేసీ వాటా 7.05 టీఎంసీలు ఉంది. ఆ నీటిని తీసుకోవడానికి వీలుగా రోజుకు 2 వేలు క్యూసెక్కులు ప్రభుత్వ ఆదేశాల మేరకు టీబీ డ్యాం నుంచి విడుదల చేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో కేసీ కాలువకు సుంకేసుల బ్యారేజీ నుంచి నీరు విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తాం.

- ప్రతాప్, కేసీ కాలువ ఈఈ

## రేపటి నుంచి భూ రీసర్వే

**కర్నూలు కలెక్టరేట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు కింద జిల్లాలో భూ సర్వే కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు కింద రీసర్వే గురించి జిల్లాలో ఆర్ఎస్‌డీటీలు, మండల సర్వేయర్లు, డిప్యూటీ తహసీల్దార్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లాలో 25 మండలాల్లోని 25 పైలెట్ గ్రామాలు ఎంపికయ్యాయి. గ్రామాన్ని 200 నుంచి 250 ఎకరాల బ్లాకులుగా విభజించి 3 నుంచి 4 బృందాలు సర్వే చేస్తాయి. ప్రతి బృందంలో ఇద్దరు విలేజ్ సర్వేయర్లు, 1 విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, 1 విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్‌తోపాటు ఆ గ్రామంలో పని చేస్తున్న ఒక విలేజ్ సర్వేయర్, ఒక విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ ఉంటారు. ఆదోని డివిజన్‌లో 9 గ్రామాలు, కర్నూలు డివిజన్‌లో ఏడు గ్రామాలు, పత్తికొండ డివిజన్‌లో 9 గ్రామాల్లో రీసర్వే చేయనున్నారు.

## ముగిసిన నవోదయ పరీక్షలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

**ఎమ్మిగనూరు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయని నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6వ తరగతిలో 80 సీట్లకు గాను ప్రవేశ పరీక్షకు మొత్తం 6035 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 4879 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు.

## బాలికల విద్యతోనే సాంఘిక దురాచారాలు దూరం

### రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం

**గోనెగండ్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** బాలికల విద్యతోనే సమాజంలో ఉన్న దురాచారాలు, బాల్య వివాహలు దూరమవుతాయని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం అన్నారు. శనివారం గోనెగండ్లలోని ఎంపీడీవో సమావేశ భవనంలో అంగన్‌వాడీ, వెలుగు, ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్ సిబ్బందితో కిషోర్ బాలికల వికాస శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణా ప్రాంతాలలో 12 ఏళ్లకే బాలికలకు వివాహం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి దురాచారాలను అరికట్టే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వలసలు వెళ్లే కుటుంబాలు తమ వెంటనే తమ పిల్లలను తీసుకుపోవడం వల్ల విద్యపై ఆసక్తి తగ్గిపోతోందని తెలిపారు. ప్రభుత్వం కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసిందని, వాటిపై కూలీలకు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలు సోషల్ మీడియా, సెల్ ఫోన్ వాడకం వల్ల పిల్లలు చెడిపోతున్నారని, తల్లిదండ్రులు వాటికి తమ పిల్లలను దూరంగా ఉంచే విధంగా చూడాలన్నారు. అనంతరం జిల్లా లీగల్ కమ్ ప్రొహిబిషన్ అధికారి శ్రీలక్ష్మి పోక్సో చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్ట్ అధికారి శారద, సీఐ గంగాధర్, ఎంపీడీవో మణిమంజరి, ఏపీఎం హేమలత, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రక్తదానంతో ప్రాణదానం

### మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



రక్తదానం చేస్తున్న మంత్రి బీసీ

**బనగానపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా బనగానపల్లెలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్వయంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం మరొకరి జీవితంలో వెలుగు నింపుతుందన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి సమాజానికి ఆదర్శప్రాయంగా నిలువాలని కోరారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి బడుగు, బలహీన వర్గాలకు అనేక పదవులు ఇచ్చారన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి కేవలం 9 నెలల్లోనే అధికారంలోకి తెచ్చిన ఘనత నందమూరి తారకరామారావుదన్నారు..

## స్వచ్ఛ కర్నూలుగా తీర్చిదిద్దుదాం

- ప్రజల సహకారంతో విజయవంతం చేయండి
- కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే దస్తగిరి

**గూడూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం ద్వారా జిల్లాను స్వచ్ఛ కర్నూలుగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ పి. రంజిత్ బాషా అన్నారు. శనివారం గూడూరు నగర పంచాయతీలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తో పాటు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌కు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి నెలా 3వ శనివారం న్యూ ఇయర్- క్లీన్ స్టార్ట్ అన్న థీమ్‌తో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌ను నిర్వహించుకుంటున్నామన్నారు. జిల్లాలో 484 గ్రామ పంచాయతీల్లో నాలుగు మున్సిపాలిటీల్లోని అన్ని వార్డులో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. ప్రజల సహకారం భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్రం, జిల్లాలు, గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం కలెక్టర్ గ్రామ ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్, ఎమ్మెల్యే అన్న క్యాంటీన్ ఆవరణలో మొక్కలు నాటారు. పాత మార్కెట్ ప్రాంతంలో ఉన్న చెత్తా చెదారాన్ని పొరకలు పట్టి శుభ్రం చేశారు. అంతకుముందు అంబేడ్కర్ సర్కిల్ నుంచి అన్న క్యాంటీన్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్డీవో సందీప్ కుమార్, మైనార్టీ సంక్షేమ అధికారి సబీహా పర్వీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీపీవో భాస్కర్ జడ్పీ సీఈవో నాసరరెడ్డి, చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు అస్లాం, లక్ష్మన్న పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

డబుల్ ఇంజన్ సర్కారుతో

## అభివృద్ధి పరుగులు

- ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

7

## రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**కర్నూలు కలెక్టరేట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ రంజిత్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు.

## మహనీయుడు ఎన్టీఆర్

**కర్నూలు అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు అమలు చేసి రాజకీయంగా ఎదుగుదలకు కృషి చేసిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఈ ప్రభాకర్, సీనియర్ నాయకుడు డి.విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్, ఆకెపోగు ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఉన్న కాంస్యవిగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం స్థాపించిన 9 నెలల్లోనే అధికారం చేపట్టిన ఘనత దేశంలో మరెవరికీ లేదన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రికార్డు స్థాయిలో కోటి మందికి పైగా సభ్యత్వం చేసుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. ఎన్టీఆర్ అడుగుజాడల్లో ఆయన ఆశయసాధన కోసం సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ పనిచేస్తూ పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంద్యాల నాగేంద్ర, కేఈ జగదీష్, సోమిశెట్టి నవీన్, కేవీ సుబ్బారెడ్డి, కైప పద్మలతా రెడ్డి, అబ్బాస్, సత్రం రామకృష్ణుడు, హనుమంతరావు చౌదరీ, జేమ్స్, ఎల్లప్ప పాల్గొన్నారు.

- టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం
- ఘనంగా ఎన్టీఆర్ 29వ వర్ధంతి






టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకుల నివాళి

తుంగభద్ర తీరం

# సాహిత్యం




## మనసును ముట్టుకునే 'వేకువలో చీకటిలో'

కర్నూలు కల్చరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన కేవీఆర్ మహిళా కళాశాల విశ్రాంత అధ్యాపకురాలు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం (మీరాబాయి) రచించిన 'వేకువలో చీకటిలో' కథల సంకలన పాఠకుల హృదయాన్ని సున్నితంగా స్పృశిస్తాయి. సుమారు 37 కథలతో ఈ పుస్తకాన్ని ఆమె ఎనిమిది పదుల వయస్సులో ప్రచురించారు. ఆమె ఎనిమిదో కథా సంకలనం ఇది. 1963లో మొదలైన ఈమె కథా రచన నేటికీ కొనసాగుతూనే ఉంది. కేవీఆర్ మహిళా కళాశాల్లో ఆంగ్లోపన్యాసకురాలిగా పదవీ విరమణ చేసిన మీరాబాయి ఇప్పటి వరకు 200పైగా కథలు, ఒక నవల, మూడు నవలికలు రాశారు. మధ్యతరగతి జీవితాలను, మానవీయ విలువలను ఇతివృత్తాలుగా చేసుకొని, మన చుట్టూ జరిగే సంఘటనలను సరళంగా, క్లుప్తంగా, మనసును తట్టేలా, మానవ సంబంధాలను పటిష్టపరిచేలా రచన చేశారు. జీవన వైవిధ్యాలను, విరుద్ధ మనస్తత్వాలను ఆమె లోతుగా చిత్రించడం ఆమె ప్రత్యేకత. మధ్య తరగతి స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆధునిక భావజాలం, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత, కరోనా కాలంలో ఎదురైన సంక్లిష్టతలు ఇలా అనేక ఇతివృత్తాలు ఇందులో ఉన్నాయి.


పదవీ విరణ తర్వాత కుటుంబంలో జరిగే పలు సంఘటనల వల్ల మనశ్శాంతిని కోల్పోయి నిరాశతో బతుకులు వెళ్లదీసే వయోవృద్ధులు.. చివరికి సేవను పరమావధిగా ఎంచుకునే ఇతివృత్తంతో 'నలుగురి కోసం' కథ రాశారు. జీవితంలో అన్నీ దక్కినా ఉద్యోగ విరమణ తర్వాత కలిగిన నిర్వేదం వల్ల నిరాశా నిస్పృహలతో కుంగిపోతున్న నీరజ, ఉన్నంతలోనే సంతృప్తిగా బతుకుతున్న లలితమ్మను స్ఫూర్తి పొందుతుంది. ఈ కథ పేరు 'జీవితం జీవించడానికే'.

రెండు రోజులు తిండిలేకుండా ఆకలితో అల్లాడిపోతున్న సుందరానికి ఆబ్దికాలకు వెళ్లి రెండుసార్లు భోజనం చేసే అవకాశం వస్తుంది. అయితే ఆకలితో ఎండుకుపోయిన పేగుల్లో తిన్న ఆహారం ఇమడలేక వాంతులై జబ్బుపడతాడు. ఆ స్థితిలో కూడా తనకు వచ్చిన దక్షిణను మరో పేదవాడి చదువుకు వెచ్చిస్తాడు. ఈ ఉదాత్త సంఘటన కేంద్రంగా రాసిన కథ 'ఆపద్ధర్మం'. ఈ సంపుటి శీర్షిక 'వేకువలో చీకటిలో' అనే కథలో ఆ ఇంటి ఇల్లాలె నిత్యం బండెడు చాకిరీ చేస్తున్నా తన కష్టాన్ని ఏమాత్రం గుర్తించకుండా, చిరాకుపడుతూ, అవహేళనగా మాట్లాడే భర్తను భరిస్తూ ఉంటుంది. పెళ్లయిన కొత్తల్లో అతను రాసిన ఉత్తరాల్లో చూపిన ప్రేమను గుర్తుచేసుకొని, పరిస్థితుల ప్రభావంతో మారిన భర్త ధోరణి అర్థం చేసుకుంటుంది. రాజీమార్గంలో పయనిస్తూ సంసారాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో కష్టమైనా, సుఖమైనా నాకు నువ్వు, నీకు నేను అనుకుని భర్తను ఆదరిస్తుంది. ఇలా అనేక కథలు పాఠకుల గుండెను తట్టిలేపే విధంగా, ఆలోచనాత్మకంగా సాగుతాయి. అచ్చ తెలుగు పదాలను మాత్రమే ఎక్కువగా వినియోగిస్తూ అన్ని వర్గాలు చదువుకునే విధంగా రచయిత్రి శైలిని ఎన్నుకున్నారు. ఈ కథల్లోని సంఘటనలు, ఎదురయ్యే పాత్రలన్నీ పాఠకులకు తమ జీవితంలో ఎక్కడో తారసపడినట్లుగా అనిపిస్తాయి. పుస్తక విక్రయ కేంద్రాల్లో ఈ కథా సంపుటి లభిస్తుంది.



- డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, కర్నూలు

## గుర్తుకొస్తున్నాయి...!



లోకజ్ఞానమే తెలియని బాల్యంలో
బరువు, బాధ్యతలు కనపడని ఆ లేత వయసులో
పచ్చని పొలాల గట్లపైన చేసిన సందడి
పంట కాలువలో చేప పిల్లలా కొట్టిన కేరింతలు..

ఆకలి మరచిన కడుపుతో వీధి మూలల్లో
మూగిన జతగాళ్లతో ఆడిన గోలీలాటలు
గెలుపు కోసం చేసే విశ్వ ప్రయత్నాల్లో
జార్చిన చెమట చుక్కల మధ్య వరించిన
ఆకలిని కూడా జయించిన విజయానందం
ఇవన్నీ మదిని మురిపించన ఆనాటి
మధురానుభూతులు..!

ఎగరేసిన పతంగులు
ఎండిన పొలాల్లో కబడ్డీ
చింత తోపుల్లో
కోతికొమ్మచ్చి
బడి గోడలను ఎగిరి
దూకిన దాగుడు మూతలు..

అమ్మ పెట్టే చద్దన్నం
నాన్న కొనిచ్చే పిప్పిమెంటు బిళ్ల
స్నేహితుడు కొరికి ఇచ్చిన కాకి ఎంగిలి
భుజాలపై వేసుకునే చేతుల వంతెన
ఎంత బలమైన బాల్యపు బంధమో కదా..?
ఇప్పుడేదీ ఈ కాంక్రీట్ జంగిల్‌లో అంత
పటిష్టమైన అనుబంధం..?

బాల్యం ఒక మరుపురాని అనుబంధం
బాల్యం ఒక చెరిగిపోని జ్ఞాపకం...
బాల్యం చివరి మజిలీ వరకు గుండెల్లో
ఉండిన వెలుగు నీడ
బాల్యం ప్రతి ఒక్కరికీ జీవిత సత్యాన్ని
నేర్పే గొప్ప అడుగు జాడ



- ఎం. రాజశేఖర్, కర్నూలు

## నాగేశ్వరయ్యకు 'తెలుగు కీర్తి' పురస్కారం



కర్నూలు కల్చరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన కవి, రచయిత, కళాకారుడు కేవీ నాగేశ్వరయ్య విజయవాడలోని శ్రీశ్రీ కళావేదిక జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 21న విజయవాడలోని శ్రీకౌతా పూర్ణానంద విలాస్ సమావేశం హాలులో కళావేదిక ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. తెలుగు భాషా పరిరక్షణ, తెలుగు వైభవం చాటుకునే దిశగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశేష కృషి చేస్తున్న శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయిట్రీ అకాడమీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పురస్కార గ్రహీత కేవీ నాగేశ్వరయ్య తెలిపారు. ఇప్పటి వరకు వైదిక రత్న తదితర పురస్కారాలు అందుకున్న తాను ఇటీవల విడుదలైన 'సీతారాం సిత్రాలు' అనే తెలుగు సినిమాలో తండ్రి పాత్రలో నటించినట్లు తెలిపారు. తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపిక పట్ల నాగేశ్వరయ్యను పలువురు కళా, సాహితీవేత్తలు అభినందించారు.

## నగరంలో నేడు

- రానున్న రిపబ్లిక్ డే పురస్కరించుకుని ఆదివారం ఉదయం 7:30 గంటలకు జడ్పీ కార్యాలయం నుంచి కొండారెడ్డి బురుజు వరకు '2కే మారథాన్ రన్' నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బి.మహావీర్, నిఖిల్‌గౌడ్, చిరంజీవి తెలిపారు. మారథాన్‌లో పాల్గొనే వారు తెల్లటి టీషర్టులు ధరించి రావాలని సూచించారు.
- నగరశివారులో మామిదాలపాడులోగల గోదా రంగనాథస్వామి (గోదా గోకులం) దేవస్థానానికి ఆదివారం ఉదయం 8 గంటలకు అష్టాక్షరీ పీఠాధిపతి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి బృందం రాక.
- గోదారంగనాథస్వామి దేవస్థానం (గోదాగోకుల క్షేత్రం)లో ధనుర్మాస ముగింపు వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీగోదా రంగసాథుల వైభవ కల్యాణం నిర్వహి స్తున్నా రు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయంలో నిత్య కల్యాణం పచ్చతో రణం పూజాది కార్యక్ర మాలకు శ్రీకారం చుడుతున్నట్లు గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తెలిపారు.
- కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు 'కనకపుష్య రాగం' సాంఘిక నాటకం ప్రదర్శన ఉంటుంది. విజయవాడకు చెందిన సీనియర్ సినీ నాటక రంగ నటుడు ఎస్కే మిశ్రో దర్శకత్వం వహిస్తున్న ఈ నాటకం అనేక చోట బహుమతులు గెల్చుకుందని కన్వీనర్లు డి.ఈశ్వరయ్య, యాగంటీశ్వరప్ప తెలిపారు.



**కవితలకు ఆహ్వానం**

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

# సాహితీ స్రవంతి ఒక చారిత్రక అధ్యాయం

- రాజకీయ విశ్లేషకుడు, సీనియర్ జర్నలిస్టు తెలకపల్లి రవి
- చారిత్రక నవల 'చతురిత' ఆవిష్కరణ
- నగరంలో సంస్థ కార్యాలయం ప్రారంభం



సాహితీవేత్తలతో కలిసి చతురిక నవలను ఆవిష్కరిస్తున్న తెలకపల్లి రవి



కర్నూలు కల్చరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య చరిత్రలో సాహితీ స్రవంతి సంస్థది చారిత్రక అధ్యాయమని, ప్రగతిశీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడంలో స్రవంతి విశేష కృషి చేస్తోందని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, సీనియర్ జర్నలిస్టు, సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తెలక పల్లి రవి అన్నారు. శనివారం ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు తెలకపల్లి నరసింహయ్య 6వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కృష్ణనగర్‌లోని నరసింహయ్య నివాసంలో ఆయన చిత్రపటానికి సాహితీ వేత్తలు, కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు పుష్ప మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడుతూ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా నరసింహయ్య నివాసంలో సాహితీ స్రవంతి సంస్థ ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సామాజిక విశ్లేషకుడు, గాడిచర్ల ఫౌండేషన్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలకపల్లి రవి పరిశోధనాత్మక సేకరణ, 108 ఏళ్ల నాటి కర్నూలు నవల 'చతురిక'ను ఆవిష్కరించారు. ఈ సభకు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అధ్యక్షత వహించగా, తెలకపల్లి రవి మాట్లాడుతూ ఉయ్యాలవాడ రామచంద్రరావు నూట ఎనిమిది ఏళ్ల క్రితం చతురిక నవల రాశారని, ఈ నవల 1917లో కర్నూలులో అచ్చయిందని అన్నారు. అయితే చతురిక చరిత్రకెక్కని నవలగా ఉండిపోయిందని అన్నారు. కర్నూలు కేంద్రంగా అనేక సాహిత్య ఉద్యమాలను తమ నివాసం నుంచే నడిపామని ఆయన గుర్తు చేసుకున్నారు. సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాలకు ఎంతో చేయూతనిచ్చిన తమ తండ్రి నరసింహయ్య ఆశయాలకు పునరంకితం అవుతామని అన్నారు. కేసీ కల్కూర మాట్లాడుతూ సాహిత్య చరిత్రలో కర్నూలు ప్రాంతానికి విశిష్టమైన స్థానం ఉందని, ఎంతోమంది స్వాతంత్ర సమరయోధులు, చరిత్రకారులు గొప్ప సాహిత్యాన్ని అందించారని అన్నారు. వనం శంకరశర్మ, గాడిచర్ల సర్వోత్తమరావు వంటి ప్రముఖులు సాహిత్యానికి విశేష కృషి చేశారని అన్నారు.

విశిష్ట అతిథిగా హాజరైన టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు విద్వాన్ పత్తి ఓబులయ్య మాట్లాడుతూ సాహితీ స్రవంతి కార్యాలయం సాహిత్య, సాంస్కృతిక కేంద్రంగా విరాజిల్లాలని ఆకాంక్షించారు. నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ మాట్లాడుతూ చతురిక నవల కర్నూలు సాహిత్య చరిత్రను మలుపు తిప్పుతుందని అన్నారు. ఈ నవల మీద ఇంకా చాలా పరిశోధన జరగాల్సి ఉందని అన్నారు. కెంగార మోహన్ మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి కర్నూలు జిల్లాకు విశిష్టస్థానం ఉందని అన్నారు. కార్యక్రమ సమన్వయకర్త, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ నరసింహయ్య ఇంటితో తనకు 45 ఏళ్ల అనుబంధం ఉందని అన్నారు. ఈ సభలో సాహితీవేత్తలు నాగేశ్వరాచారి, మారుతి పౌరోహితం, ఇనాయతుల్లా, సయ్యద్ జహీర్ అహ్మద్, ఏవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదనానికి ప్రతిరూపం ఎన్టీఆర్

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న సోమిశెట్టి, టీడీపీ నాయకులు

కర్నూలు అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదనానికి నిలువెత్తు రూపం నందమూరి తారక రామారావు అని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో నైతిక విలువలు పాటిస్తూ, పేదవాడి అభివృద్ధిని ఆకాంక్షించిన రాజకీయ నాయకుడు ఎన్టీఆర్ అన్నారు. టీడీపీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా అవకాశం కల్పించి వారి ఎదు గుదలకు కృషి చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. అంతటి గొప్ప వ్యక్తికి భారత రత్నతో గౌరవించాలని డిమాండ్ చేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వెన్నెల పరిమళభరిత పద్యాలు



కైరవి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయతలు

### ఘనంగా కైరవి పుస్తకావిష్కరణ

నంద్యాల (కల్చరల్), జనవరి 18: చల్లని వెన్నెల వెలుగు పరిమళాలను మధుసూదన్ తన పద్య కృతి కైరవిలో ఆవిష్కరించారని కళారాధన ప్రధాన కార్యదర్శి డా. రవిక్రిష్ణ పేర్కొన్నారు. శనివారం పింగళిసూరన శాఖా గ్రంథాలయంలో గణిత ఉపాధ్యాయుడు, కవి మధుసూదన్ రచించిన కైరవి ఖండకావ్య పుస్తకావిష్కరణ సభను ఘనంగా నిర్వహించారు. ముందుగా కవులు, రచయితలు, పాఠకులు, అతిథులు తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలర్పించారు. అనంతరం కైరవి పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. రవికృష్ణ మాట్లాడుతూ వచన కవిత్వం వైపు కవులు మొగ్గుచూపుతున్న సమయంలో సరళమైన పద్యాలను అద్భుతమైన సందేశాలతో మధుసూదన్ రాసి పాఠకలోకాన్ని అలరించారన్నారు. 41 చందో వైవిధ్యాలతో నవరసభరితంగా కైరవి పుస్తకాన్ని తెలుగు సాహితీలోకానికి అందించారన్నారు. ఈ కార్యక్రమంలో డా. వెంకటరమణమూర్తి, అన్నెం శ్రీనివాసరెడ్డి, డా. గంగుల నాగరాజు, డా. నీలం వెంకటేశ్వర్లు, గ్రంథాలయాధికారి శ్రీధర్, మధు, కవులు మాబుబాషా, నరేంద్ర, శేషఫణి, డా. కిషోర్, ప్రసాద్, నీలకంఠమాచారి పాల్గొన్నారు.

# అ'పూర్వ' సమ్మేళనం

- 29 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు
- పెద్దతుంబళం జడ్పీ పాఠశాలలో పాత రోజులు



అప్పటి ఉపాధ్యాయులతో పెద్దతుంబళం పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆదోని రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'హాయ్ రా.. ఎలా ఉన్నావ్. ఏం చేస్తున్నావ్... నిన్ను చూసి చాలా కాలమైందిరా. చాలా మారిపోయావ్.. ఎంత మంది పిల్లలు, వాళ్లేం చదువుతున్నారు. నాడు తరగతిలో వీడు అలా చేశాడు.. ఇలా చేశాడు' అంటూ ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థుల పలకరింపులు ఇవి. గత మధుర జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. ఆదోని మండలం పెద్దతుంబళం జడ్పీహెచ్ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థులు. ఆ పాఠశాలలో 2001-02 సంవత్సర బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు శనివారం పాఠశాలలో ఒకచోటకు చేరారు. 29 ఏళ్ల తర్వాత కలిసిన వారు.. గత అనుభూతులు, చేసిన అల్లరిని గుర్తు చేసుకుని మునుపటి రోజులకు వెళ్లారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడి మంచి హోదాల్లో పనిచేస్తున్న వీరంతా స్నేహితులతో ఆనందంగా గడిపారు. అప్పటి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విద్యాబుద్ధులు నేర్పిన వారి పాదాలకు నమస్కరించి ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ ప్రాణ స్నేహితులతో కలసి ఇలా రోజంతా గడపడం చాలా ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులతో కలసి భోజనాలు చేశారు. ఇదిలా ఉండగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, తెలుగు పండిట్ ఎర్రమ పాండురంగయ్య 'గుర్తుకొస్తున్నాయి.. ఆనాటి పాత రోజులు భలే..భలే.. అలనాటి జ్ఞాపకాలు ఎంతో మధురం..' అంటూ పద్యరూపంలో పాడిన పాట ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఎంఈఓ ఈరన్న, ప్రధానోపాధ్యాయులు అయ్యాళప్ప, ఉపాధ్యాయులు రంగన్న, లక్ష్మీ నారాయణ, రవీంద్ర లాల్, ముజాబుర్, రెహమాన్, పూర్వ విద్యార్థులు అల్లావుద్దీన్, ఖాలీద్ బాష, రమేష్, అంజినమ్మ, సుజాత, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

### మాతృ భాషను మరువొద్దు



మాతృభాష తెలుగును ఎవరూ మర్చిపోకూడదు. తెలుగు భాషలో ఉన్నంత మాధుర్యం మరే భాషల్లోనూ లేదు. వృత్తి, ఉద్యోగరిత్యా ఇతర భాషలు నేర్చుకున్నప్పటికీ నేటితరం పిల్లలకు తెలుగు భాషకు ఉన్న ఖ్యాతిని తెలియజేయాలి. ప్రతి విజయం వెనుక స్త్రీమూర్తి ఉంటారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా వారి ప్రోత్సాహం అనిర్వచనీయం. ఇన్నేళ్ల తర్వాత కూడా విద్యార్థులు కలసిమెలసి ఉండటం చాలా ఆనందంగా ఉంది.

- ఈ. పాండురంగయ్య, రిటైర్డ్ హెచ్ఎం



రిటైర్డ్ హెచ్ఎం పాండురంగయ్యను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

# నిరాశ్రయులకు నీడ

- ఆకాశమంత ఆప్యాయతను పంచే సంఘమిత్ర
- 60 మంది విద్యార్థులకు ఆశ్రయం ఇస్తున్న సంస్థ
- నేడు 31వ వార్షికోత్సవం

**కన్నవారికి దూరమైన పిల్లలకు అమ్మ ప్రేమను పంచడానికి ఎవరో ఒకరు ముందుకు రావాలి. ఏ చేయూత లేని వారికి ఆదరువై ఆప్యాయతనందించే ఆకాశమంత పెద్ద మనసు ఉండాలి. ఇవన్నీ సంతరించుకున్న సంఘమిత్ర సేవా సమితి నిరాశ్రయ బాలలను అక్కున చేర్చుకుంటున్నది. తల్లిదండ్రులలాగే బాధ్యతతో, ప్రేమాభిమానాలతో పాటు మంచి చెడు, నైతిక విలువలు, దేశభక్తిని బోధించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నది. బడుగు, బలహీన, అణగారిన పేద ప్రజలకు తోడుగా ఉంటూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి వారికి సమాజంలో గౌరవాన్ని కల్పిస్తూ కనీస అవసరాల తీరుస్తున్నది. నేడు 31వ వార్షికోత్సవం జరుపుకోనున్న సంఘమిత్ర సేవా సమితిపై ప్రత్యేక కథనం..**



నంద్యాల కల్చరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరాశ్రయ బాలల కోసం ఆగస్టు 15, 1994న నంద్యాల పట్టణంలో కేవలం నలుగురు అబ్బాయిలతో చిన్న బాడుగ గృహంలో సంఘమిత్ర సేవా సమితి ఏర్పడింది. పట్టణంలో ఎంతో మంది సేవాపరులు అందించిన ఆర్థికసహాయంతో ఈ సంస్థ దినదినాభివృద్ధి చెందుతూ ఇప్పుడు సొంత గృహంలో 60 మంది విద్యార్థులకు ఆశ్రయం కల్పిస్తున్నది.

### సంఘమిత్ర ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

1995 నుండి ఇప్పటి వరకు ఎన్నో రక్తదానశిబిరాలను ఏర్పాటు చేసి, ఎంతో మంది విలువైన ప్రాణాలు కాపాడింది. మురికి వాడల్లో, గ్రామాలలో వైద్యసేవలను అందిస్తున్నది. క్షయ వ్యాధి నివారణ కోసం లక్ష రూపాయల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నది. బండిఆత్మకూరు, వెలుగోడు మండలంలోని చిన్నస్వామి గూడెం, నెమలుల కొండ, ఒంటిగుడిసె తాండ, చెంచుకాలనీలు, ఇలా పలు చెంచు గూడెంకు చెందిన గ్రామాలలోని ప్రజలకు దుస్తులు, దుప్పట్లు, అలాగే రోగులకు ఉచిత వైద్యసేవలు, మందులు అందిస్తున్నది. ప్రతి సంవత్సరం దాదాపు 12000 మంది చెంచులకు వైద్య సహాయం అందిస్తోంది.

- అమ్మాయిలకు విద్యతో పాటు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం నిర్వహించి కుట్టుమిషన్లు ఇస్తోంది. చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను ఇస్తోంది. కొత్తపల్లి గ్రామంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తోంది. విద్యార్థులకు ఉచిత ట్యూషన్ సెంటర్లు నడుపుతోంది.
- బాలబాలికలకు ముగ్గులపోటీలు, మొహందీ శిక్షణా కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దేశనాయకుల జన్మదినం సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహిస్తోంది

### సంఘమిత్ర నన్ను తీర్చిదిద్దింది



నాపేరు రంగంరెడ్డి మహేశ్వరరెడ్డి. తల్లిదండ్రులు లేని నన్ను సంఘమిత్ర అక్కున చేర్చుకుని ప్రేమ, ఆప్యాయతలు అందించింది. నేనే సంఘమిత్రలో మొదటి విద్యార్థిని. సంఘమిత్ర వ్యక్తిగా నన్ను తీర్చిదిద్దింది. ఎంకామ్ వరకు చదువుకున్నాను.

- రంగంరెడ్డి మహేశ్వరరెడ్డి(పీజీ), ప్రైవేటు ఉద్యోగి

### సమాజ సేవలో సంఘమిత్ర



సమాజసేవలో సంఘమిత్ర నిరంతరం అందరి సహాయ సహకారాలతో పనిచేస్తున్నది. సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన కల్పించి విద్యార్థులను క్రమశిక్షణ కలిగిన భావి భారత పౌరులుగా తీర్చి దిద్దుతోంది.

-చిలుకూరి శ్రీనివాస్, కార్యదర్శి

# పూర్తిస్థాయి సేవలు ప్రారంభించాలి

- అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లు
- స్టేట్ కేన్సర్ హాస్పిటల్ తనిఖీ



స్టేట్ కేన్సర్ హాస్పిటల్‌ను తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎంఈ

**కర్నూలు హాస్పిటల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** ఫిబ్రవరి మొదటి వారంలో కర్నూలు స్టేట్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పూర్తి స్థాయి సేవలు అమలు కావాలని అడిషనల్ డీఎంఈ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శనివారం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాకె. వెంకటేశ్వర్లు, స్టేట్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డా. కృష్ణప్రకాష్‌తో కలిసి కేన్సర్ హాస్పిటల్‌ను తనిఖీ చేశారు. కేన్సర్‌హాస్పిటల్‌కు ఆక్సిజన్, జనరేటర్లు, సివిల్ వర్క్‌లను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్‌ను ఆదేశించారు. ఆక్సిజన్ పైపులైన్‌ను నాలుగు రోజుల్లో పూర్తి చేయాలన్నారు.

ఎట్టి పరిస్థితుల్లో ఫిబ్రవరిలో కేన్సర్ రోగులను అడ్మిషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేన్సర్ హాస్పిటల్‌కు కర్నూలు జీజీహెచ్ నుంచి 10 మంది హెడ్ నర్సులు, 40 మంది స్టాఫ్ నర్సులు, 20 మంది శానిటేషన్, 10 మంది సెక్యూరిటీ సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్, వైద్య విద్యార్థులు పీజీ, ఎస్ఆర్‌లను సర్దుబాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు జీజీహెచ్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బీవీ రావు, కేన్సర్ హాస్పిటల్ సీఎస్ఆర్ఎంవో డా.హేమనళిని, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

**సర్దుబాటు చేయడానికి వచ్చారా?**

రూ.120 కోట్లతో ఏర్పాటు చేసిన స్టేట్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ భవనం పూర్తయింది. కొన్ని పరికరాలు ఇంకా హాస్పిటల్‌కు చేరలేదు. ఆక్సిజన్ పనులు ప్రారంభం కాలేదు. లిఫ్టు, వెంటిలేటర్లు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ పరిస్థితుల్లో శనివారం స్టేట్ కేన్సర్ హాస్పిటల్‌కు అడిషినల్ డీఎంఈ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు వచ్చారు. అందరూ కేన్సర్ హాస్పిటల్‌కు నిధులు తీసుకుని వచ్చారా అంటూ అందరూ వైద్యులు అనుకున్నారు. అడిషనల్ డీఎంఈ మాత్రం నిధుల గురించి ఏ మాత్రం చెప్పకుండా కర్నూలు జీజీహెచ్ నుంచి సిబ్బంది, వైద్య విద్యార్థులు పరికరాలను సర్దుబాటు చేయాలని చెప్పడం అందరినీ విస్మయానికి గురి చేసింది. వైద్య విద్యార్థులు పీజీ, ఎస్ఆర్, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్‌నర్సులు, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందిని కర్నూలు జీజీహెచ్ నుంచి సర్దుబాటు చేయాలని ఆదేశించడంతో సర్వజన వైద్యశాలపై పడుతుంది. పోస్టులు భర్తీ చేయకుండా పరికరాలు తెప్పించకుండా సివిల్ వర్క్‌కు నిధులు ఇవ్వకుండా తూతూమంత్రంగా కేన్సర్ హాస్పిటల్‌లో ఐపీ రోగుల సేవలు ఎలా ప్రారంభిస్తారని కొందరు వైద్యులు చర్చించుకుంటున్నారు. కర్నూలు జీజీహెచ్‌కు ప్రతిరోజు 3వేల మంది ఓపీ రోగులు వస్తుంటారని, ఇక్కడున్న సిబ్బంది పరికరాలను కేన్సర్ హాస్పిటల్‌కు పంపిస్తే దీని ప్రభావం కర్నూలు పెద్దాసుపత్రికి వచ్చే రోగులపై తీవ్ర ప్రభావం పడుతుందని అంటున్నారు. సేవలు ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాయలసీమకు వరప్రసాదినిగా ఉన్న స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు నిధులు విడుదల చేసి, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని రోగులు కోరుతున్నారు.

## వలస వెళ్లొద్దు.. పనులు కల్పిస్తాం




కోల్‌మాన్ పేట గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న డీఈవో

**కోసిగి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** వలస వెళ్లకుండా స్థానికంగానే పనులు కల్పిస్తామని కోసిగి మండల ప్రత్యేక అధికారి, డీఈవో శ్యామ్యూల్ పాల్ అన్నారు. వలసలపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలకు వారు స్పందించారు. ఈ మేరకు శనివారం మండలంలోని దుద్ది, కోల్‌మాన్‌పేట, వందగల్లు, ఆర్లబండ, అగసనూరు తదితర గ్రామాల్లో ప్రజలతో సమావేశం నిర్వహించారు. చదువుకునే పిల్లల్ని వెంట తీసుకెళ్లి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. బడి ఈడు పిల్లలకు అన్నం పెట్టి చదివిస్తామని దుద్ది, కోల్‌మాన్‌పేట గ్రామాల్లో అవగాహన కల్పించారు. స్థానికంగా పనులు లేకపోవడం, ఉపాధి పనులు కూలి డబ్బులు తక్కువగా వస్తుండటంతో వలస పోతున్నామని పలువురు వాపోయారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో చంద్రశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డుల్లో కనిపించని మద్దతు ధర

**కర్నూలు అగ్రికల్చర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు మార్కెట్ యార్డుతోపాటు ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో గిట్టుబాటు ధర దక్కుతుందనే ఆశతో రైతులు పంట ఉత్పత్తులను విక్రయానికి తీసుకువస్తున్నారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మాత్రం వారికి అందడం లేదు. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్న కర్నూలు మార్కెట్ యార్డులో శనివారం రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులకు మద్దతు ధరలు అందలేదు. మధ్యస్థ, కనిష్ఠ ధరలు మరింతగా పతనమై పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వేరుశనగ కాయలకు ప్రభుత్వం క్వింటానికి రూ.6,720 మద్దతు ధరను ప్రకటించింది. అయితే శనివారం కర్నూలు మార్కెట్ యార్డులో గరిష్ఠ ధర రూ.6,216, మధ్యస్థ ధర రూ.4,940, కనిష్ఠ ధర రూ.3,116 మాత్రమే అందింది. కందులకు మద్దతు ధర రూ.7,600 ధరను ప్రకటించింది. ఈ కందులకు మార్కెట్ యార్డులో కొంత వరకు మద్దతు ధర అమలైంది. గరిష్ఠ ధర రూ.8,001, మధ్యస్థ ధర రూ.7,089, కనిష్ఠ ధర రూ.3000కు అమ్ముడుపోయినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. ఉల్లిగడ్డలకు వారం రోజులుగా ధర పెరుగుతూ వస్తుంది. గరిష్ఠ ధర రూ.2,651, మధ్యస్థ ధర రూ.2,389, కనిష్ఠ ధర రూ.1237 దక్కింది. ఎండుమిరప కాయలకు గరిష్ఠ ధర రూ.14వేలు, మధ్యస్థ ధర రూ.11,709, కనిష్ఠ ధర రూ.4,409 దక్కింది. కొర్రలకు గరిష్ఠ ధర రూ.3,011, మధ్యస్థ ధర రూ.2,619, కనిష్ఠ ధర రూ.1,813 దక్కింది. మినుములకు గరిష్ఠ ధర రూ.8,109, మధ్యస్థ ధర రూ.2,619, కనిష్ఠ ధర రూ.1,813 దక్కింది.

## పొగాకు షెడ్లు దగ్ధం



పూర్తిగా కాలిబూడిదైన పొగాకు షెడ్లు

**గడివేముల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పైబోగుల గ్రామంలో పొగాకు షెడ్లు దగ్ధమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివీ.. పైబోగుల గ్రామానికి చెందిన ఈశ్వరయ్య 4 ఎకరాల్లో, సూర్య వెంకటేశ్వర్లు 2.50 ఎకరాల్లో పొగాకు పంట సాగు చేశారు. పంట కోసి పొగాకు ఎండబెట్టే క్రమంలో ఈశ్వరయ్య 4 షెడ్లు వేశారు. సూర్య వెంకటేశ్వర్లు 3 షెడ్లు వేసి పొగాకు నిల్వ చేశారు. శుక్రవారం రాత్రి షెడ్డులో మంటలు చెలరేగి పొగాకు దగ్ధమవుతుందని స్థానికులు చెప్పడంతో బాధితులు చేరుకున్నారు. మంటలను ఆర్పాలని ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. పొగాకు పూర్తిగా దగ్ధమైంది. ఈశ్వరయ్యకు రూ.7 లక్షలు, సూర్య వెంకటేశ్వర్లుకు రూ.5.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు వారు తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిందా?, గుర్తు తెలియని వ్యక్తులు షెడ్లకు నిప్పంటించారా? అని బాధితులు ఫిర్యాదు చేశారని ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పరిశీలించారు. బాధితులకు అండగా ఉంటామన్నారు.

## నిందితుల అరెస్టు



నిందితులను మీడియాకు చూపుతున్న డీఎస్పీ వెంకట్రామయ్య

**చిప్పగిరి, జనవరి18 (ఆంధ్రజ్యోతి):** దాడి కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. మండల పరిధిలోని బంటనహాళ్ గ్రామంలో ఈ నెల 13న రామాంజినేయులు, తలారి సురేష్ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. తీవ్రంగా గాయపడిన రామాంజనేయులు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఏడుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అరెస్టు చేశారు. పత్తికొండ డీఎస్పీ బి.వెంకట్రామయ్య శనివారం మధ్యాహ్నం స్థానిక చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. తలారి సురేష్‌తోపాటు మరో ఆరుగురిని శనివారం ఏరూరు-గుమ్మనూరు వై జంక్షన్ వద్ద ఆలూరు సీఐ వెంకటచలపతి, చిప్పగిరి ఎస్సై సతీష్ కుమార్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో అరెస్టు చేశామని డీఎస్పీ చెప్పారు. సమావేశంలో హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్ బాషా, ఖాదర్ భాషా, భాస్కర్, రామోజీ, తిప్పన్న, గురుప్రసాద్ పాల్గొన్నారు.

## నీటి కుంటలో పడి బాలుడి మృతి

**ఆస్పరి, జనవరి18 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పుట్టకలమర్రి గ్రామానికి చెందిన బాలుడు రాజేష్ (6) నీటి కుంటలోపడి శనివారం మృతి చెందాడు. తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. రాజు, అనిత దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాజేష్, చిన్న కుమారుడు విష్ణు. రాజేష్ ఒకటో తరగతి చదువుతున్నాడు. సెలవులు ఉండటంతో తల్లిదండ్రులు పొలానికి తీసుకెళ్లారు. తల్లిదండ్రులు పనిలో నిమగ్నమై ఉండగా, రాజేష్ స్నేహితులతో కలిసి ఆడుకుంటుంటూ పొలంలోని నీటి కుంటలోకి జారి పడ్డాడు. స్నేహితులు తల్లిదండ్రులకు చెప్పడంతో బయటకు తీశారు. బాలుడిని ఆదోని ఆసుపత్రికి, అనంతరం కర్నూలు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.



రాజేష్ (ఫైల్)

## డబుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి పరుగులు

- ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి



మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే డా. వి. పార్థసారథి

**కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధుల వరద కురిపిస్తోందని వివరించారు. శనివారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, సంక్షేమమని చెప్పిన మాట నేడు నిజమవుతోందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం విడుదల చేసిన నిధులను పక్కదారి పట్టించి, రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని అన్నారు. ఫలితంగా ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన తీర్పు ఇచ్చారని తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ ఉక్కును కాపాడుటం కోసం కేంద్రం నుంచి రూ.11400 కోట్లను సమకూర్చి ప్రాణం పోశారన్నారు. 4.2 శాతం ఉన్న ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని 7.02 శాతానికి పెంచేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. అంతేకాకుండా బ్యాంకులోని రుణాలను తీర్చడంతో పాటు గనులను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

రాయలసీమ ప్రాంతంతో పాటు అన్ని జిల్లాలోని గ్రామ పంచాయతీలకు నిధులను విడుదల చేస్తామన్నారు. ఐదు సంవత్సరాల తర్వాత అభివృద్ధి మొదలైందన్నారు. 15 ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీ ఖాతాలో జమ అవుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్తున్నాయని వివరించారు. జలజీవన్ మిషన్, అమృత్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయి ఇచ్చే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీఎస్ నాగరాజు, సీనియర్ నాయకులు డాక్టర్ కొట్టె చెన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథ్, బీజేపీ జిల్లా మీడియా ఇన్‌చార్జి పీటీ. సాయప్రదీప్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి పాల్గొన్నారు.

## ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- నంద్యాల కలెక్టర్ రాజకుమారి



**నంద్యాల (కల్చరల్), జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని ప్రారంభించిందని, సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈనెల 21వ తేదీలోగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక పోర్టల్ పీఎంఇంటర్న్‌షిప్. ఎంసీఏ.జీవోవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు దేశంలోని టాప్ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పిస్తామన్నారు. వన్‌టైం గ్రాంట్ కింద రూ.6 వేల రూపాయలతో పాటు ప్రతినెల రూ.5 వేలు స్టైఫండ్ చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, బీసీఏ, బి.ఫార్మసీ తదితర గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 21 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండాలన్నారు. వివరాలకు 6300324076, 8297812530 నెంబర్లను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మానసిక వికలాంగులకూ హక్కులు ఉన్నాయి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది




మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

**కర్నూల లీగల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** సమాజంలో అందరితో పాటు మానసిక వికలాంగులకూ హక్కులు ఉన్నాయని, వారి కోసం పలు చట్టాలు ఉన్నాయని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాల ప్యానెల్ న్యాయవాదులకు, పారా లీగల్ వలంటీర్లకు స్థానిక న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవల పథకం, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, మేధో వైకల్యాలు ఉన్న వ్యక్తులకు సంబంధించిన సేవల పథకాలు ఉన్నాయని, ఈ పథకాలను తమ చట్టాలను ఉపయోగించుకుని మానసికంగా బాధపడేవారు అభివృద్ధి చెందవచ్చని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో పలు చట్టాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శిక్షకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ ఎం.వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శివరామచంద్రరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబరు కె.వెంకటరమణయ్య, అసిస్టెంట్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ రేవతి జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీల్లో తాత్కాలిక నియామకాలపై ఆరా

- రేపటిలోపు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశం
- విశ్వవిద్యాలయ అధికారుల గుండెల్లో దడ

**కర్నూలు అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలోని యూనివర్శిటీల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా వర్శిటీ అధికారులు చేపట్టిన నియామకాలపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. వాటిపై ఈనెల 20 లోపు నివేదికలు ఇవ్వాలని అన్ని వర్శిటీల ఇన్‌చార్జి ఉపకులపతులు, రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేసింది. గత ఏడాదిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా పలు వర్శిటీల్లో తాత్కాలిక ఉద్యోగులను నియమించారు. అలాగే కోర్టు కేసులతో ముడిపడి ఉన్న సమస్యల్లో భారీ ఎత్తున ముడుపులు దండుకుని పోస్టులు కట్టబెట్టారనే ఫిర్యాదులను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఉన్నత విద్యామండలికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో ఈనెల 20లోపు అన్ని వర్శిటీలు నివేదికలు ఈ మెయిల్ ద్వారా పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపట్టిన ఆర్థిక లావాదేవీల వివరాలను పంపాలని పేర్కొంది. దీంతో జిల్లాలోని 3 వర్శిటీల్లో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరిపిన అధికారుల్లో ఆందోళన మొదలైంది. రాయసీమ యూనివర్సిటీలో 26వ పాలక మండలిలో డిస్మిస్ చేసిన ఓ ఫైనాన్స్ అధికారిని తిరిగి నియమించాలని ఆర్‌యూ అధికారులు కోర్టును ఆశ్రయించడం, ఆ తర్వాత ఉన్నత విద్యామండలికి ఫిర్యాదులు వెళ్లడం లాంటి సంఘటనలు జరిగాయి. వీటిని పరిగణలోకి తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఇన్‌చార్జిల ఉపకులపతుల పాలనల్లో వర్శిటీల్లో జరిగిన లావాదేవీలు, నియామకాలపై ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించిందని కొందరు ప్రొఫెసర్లు చర్చించుకుం టున్నారు.

## సత్తా చాటిన పెద్దకొట్టాల వృషభాలు

- జాతరలో కొనసాగుతున్న ఎద్దుల బలప్రదర్శన




ప్రథమ స్థానంలో నిలిచిన వృషభాలు

**ఎమ్మిగనూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు జాతరలో ఎద్దుల బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా సాగుతు న్నాయి. నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో శనివారం న్యూ కేటగిరి విభాగంలో కర్నూలు, నంద్యాల ప్రాంతాల నుంచి 8 జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీల్లో నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు నిర్ణీత సమయంలో 4,625 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.50వేలను కైవసం చేసుకున్నాయి. అలాగే నందవరం మండలానికి చెందిన జింకల మహేష్ వృషభాలు 3,900 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.40వేల నగదును గెలుచుకోగా, నంద్యాల జిల్లా మల్యాల గ్రామానికి చెందిన షేక్‌మహమున్ని వృషభాలు 3,707.11 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచి రూ.30వేల బహుమతిని సాధించాయి. గోనెగండ్ల మండలం పెద్దనెలటూరు చెవిటి సుంకన్న వృషభాలు 3,650 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో నిలిచి రూ.20వేలు, నంద్యాల జిల్లా పి.రుద్రవ రానికి చెందిన యల్లారెడ్డి వృషభాలు 3603.4 అడుగుల దూరం లాగి ఐదో బహుమతి రూ.10వేలను గెలుచుకు న్నాయి. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు నిర్వాహకులు నగదుతో పాటు జ్ఞాపిక అందజేసి సన్మానించారు. పోటీల సందర్భంగా వ్యాఖ్యాతలుగా చిరంజీవి, మిమిక్రి ఆర్టిస్ట్ హెచ్ కైరవాడి ఉస్మాన్ అలరించారు. పీఈటీ లక్ష్మన్న బండలాగుడు దూరాన్ని కొలిచారు. మొదటి బహుమతిని ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేంద్ర బాబు, సభ్యులు అందజేయగా మిగతావి అధికారులు, నిర్వాహకులు అందజేశారు. భాస్కర్, పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కడిమెట్ల విరుపాక్షిరెడ్డి, రాళ్లదొడ్డి మురళికృష్ణారెడ్డి, గురురాజాదేశాయ్, గోనెగండ్ల సీఐ గంగాధర్, నందవరం ఎస్ఐ వి.శ్రీనివాసులు, రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు, పట్టణ ఎస్ఐ డాక్టర్ నాయక్‌లు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి, విష్ణువర్ధన్‌రెడ్డి

**కోడుమూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ప్యాలకుర్తి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు చేనేత కార్మిక కుటుంబాలను శనివారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి పరామర్శించారు. కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మృతదేహాలను పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు తాము అండగా ఉంటామన్నారు. అలాగే కోట్ల కవితమ్మ కూడా కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నాయకులు కేఈ మల్లికార్జున గౌడ్, గోపాల్‌నాయుడు, బడేసా గౌడ్, బ్రిటీష్ రాముడు, నారాయణ పాల్గొన్నారు.

## క్యాబినెట్ ఆమోదంపై సీపీఐ హర్షం

**కర్నూలు న్యూసిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలోని పేదలకు గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాలలో 2 సెంట్ల స్థలం ఇవ్వాలని క్యాబినెట్‌లో తీర్మానం చేయడంపై సీపీఐ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా కార్యవర్గసభ్యుడు జగన్నాథం అన్నారు. శనివారం సీఆర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడుతూ సీపీఐ పోరాట ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసిందన్నారు. ఇంటి స్థలం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన కఠినమైన నిబంధనలు మార్పుచేయాలన్నారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, నాయకులు పంపన్న గౌడు, మహేష్, శ్రీనివాసరావు, నాగరాజు, బీసన్న పాల్గొన్నారు.

## నరసింహయ్య ఆశయాలను కొనసాగిస్తాం

**కర్నూలు న్యూసిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** కమ్యూనిస్టు ఉద్యమ నేత టి. నరసింహయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. శనివారం పాతబస్తీ సుర్జీత్ భవన్‌లో టి.నరసింహయ్య ఆరో వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గసభ్యుడు ఎస్ఎండీ షరీఫ్, నగర కార్యదర్శి రాజశే ఖర్, ఈశ్వర్, అబ్దుల్‌దేశాయ్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

## ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ: కమిషనర్

**కర్నూలు న్యూసిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శనివారం అశోక్‌నగర్, నెహ్రూనగర్, బీక్యాంపు, కొత్తపేట, ఎన్ఆర్‌పేట ప్రాంతాలలో పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అనిల్ కుమార్ ఉన్నారు.

## ఉల్చాలలో బెల్ట్ షాపును అరికట్టండి

**కర్నూలు అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** ఉల్చాల గ్రామంలో బెల్టు షాపును అరికట్టాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏఈఎస్ రామక్రిష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ కర్నూలు మండలంలోని ఉల్చాల గ్రామంలో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన డీఎస్పీ వెంటనే బెల్టు షాపులను అరికడతామని చెప్పారు.

## జీవో 77ను రద్దు చేయాలి

**కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. శనివారం స్థానిక కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. అబి, అశోక్, వర్దన్ పాల్గొన్నారు.

## వైసీపీ జిల్లా కార్యాలయానికి సహకరించండి

**కర్నూలు న్యూసిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** నగరంలోని ప్రధాన కూడలిలో అన్ని అనుమతులు ఉన్న వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయం నిర్మాణానికి సహకరించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. శనివారం నగర పాలక కార్యాలయంలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ అన్ని అనుమతులు ఉన్న పార్టీ కార్యాలయం నిర్మాణానికి పూర్తి చేసే విధంగా సహకరించాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## రేబిస్ టీకాపై అవగాహన

**కర్నూలు హస్పిటల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రేబిస్ టీకా, పాము కాటు నిర్వహణపై అవగాహన కార్యక్రమం (ఐఈసీ)ను డీఎంహెచ్‌వ డాక్టర్ పి.శాంతికళ శనివారం ప్రారంభించారు. జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ నాగప్రసాద్, ఎస్‌వో హేమసుందరం పాల్గొన్నారు.

## సారా స్థావరాలపై పోలీసుల దాడులు

**ఓర్వకల్లు జనవరి 18(ఆంధ్రజ్యోతి):** మండలంలోని గుమితం తాండ గ్రామంలో అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషన్ ఆదేశాల మేరకు శనివారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2,500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎస్ఐ మధుసూదన్, ఎస్‌టీఎఫ్ ఎస్ఐ ఇంద్రకిరణ్, తేజ పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ

**సి.బెళగల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** నందవరం మండలంలోని టీ చామల గూడూరుకు చెందిన రైతులు పొలం కాలువ నీటి కోసం పరిగెల జాన్‌రాజును బోయ శ్రీనివాసులు, సరస్వతి, విరాంజినేయులు, వెంకటేశ్వర్లు కలిసి దాడి చేసినట్లు వారం రోజుల క్రితం వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదైంది. శనివారం కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ గ్రామంలో ఇరువర్గాలను విచారణ చేశారు. డీఎస్పీ వెంట కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ తిమ్మారెడ్డి ఉన్నారు.




ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ నాగరాజు, తిక్కారెడ్డి, టీడీపీ నాయకులు, కల్లూరులో.. టీజీవీ కళాక్షేత్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

# ఎన్టీఆర్‌కు ఘన నివాళి

**కర్నూలు అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** నగరంలోని ఎంపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ 29వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కల్లూరు:** తెలుగుజాతి కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీ రామారావు అని కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ అన్నారు. శనివారం పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత నివాసం ముందు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ లెంజడరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ నిర్వహించారు. ముందు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రక్తదాన శిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కే.జీ.గోవిందరెడ్డి, ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్య క్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, మైనార్టీ నాయకుడు ఎస్.ఫిరోజ్, క్లస్టర్ ఇన్‌చార్జి జనార్ధన్ ఆచారి, రాఘవేంద్ర ఆచారి, నాగేశ్వరరావు, వెంకటే శ్వరరెడ్డి, ఉలిందకొండ, కొంగన పాడు టీడీపీ నాయకులు ఈవీ.రమణ, టి.వినోద్‌కుమార్, మాజీ సర్పంచులు నాగయ్య, గోరంట్ల, మాజీ ఎంపీటీసీ లక్ష్మన్న, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

● **ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి:** ఎన్టీ రామారావుకు భారతరత్న ఇవ్వాలని టీడీపీ జిల్లా కోశాధికారి పీతయా మాదన్న, కల్లూరు సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఎన్వీ.రామకృష్ణ కోరారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతిలో భాగంగా కల్లూరు కుర్వగేరిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతుసం ఘం అధ్యక్షుడు సంపతి లక్ష్మీరెడ్డి, పోలిరెడ్డి, పవన్, చంద్రశేఖరప్ప, టీడీపీ నాయకులు వాకిటి మాదేష్, కె.ధనుంజయ, లక్ష్మీపురం జి.పుల్లారెడ్డి పాల్గొన్నారు.

● తెలుగు ఖ్యాతిని ప్రపంచ నలుమూలలా చాటి చెప్పిన యుగ పురుషుడు ఎన్టీఆర్ అని టీడీపీ నాయకుడు మల్లెల పుల్లారెడ్డి కొనియాడారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ఓర్వకల్లులో ..

**ఓర్వకల్లు:** నందమూరి తారక రామారావు ప్రజలకు చేసిన సేవలు మరువరానివని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, హుశేనాపురం, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. నాయకులు రామకోటేశ్వరరావు, ఆయూ బ్, యాసిన్, శ్రీరాములు, శోభన్‌బాబు, శ్రీరామిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, గోపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సంజీవ, అల్లాబాబు, అబ్దుల్లా, రామాంజనేయులు, తిప్పాయపల్లె సుధాకర్ రెడ్డి, శకునాల మౌలీశ్వరరెడ్డి, కాకి దేవేంద్ర, ఆకుల మహేష్, రామమద్దిలేటి, నాగ మల్లేష్ పాల్గొన్నారు.

**కర్నూలు కల్చరల్:** సినీ, నాటక రంగ కళాకారులకు స్ఫూర్తి ప్రదాతగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీయార్ నిలిచిపోతారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కొనియాడారు. శనివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 29వ వర్ధంతి సందర్భంగా ఎన్టీయార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ 1986లో తాను రచించిన తెలుగు భోజుడు అనే శతకాన్ని ఎన్టీయార్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేయడం తన అదృష్టమన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహ్మద్ మియా, కళాకారులు సంగా ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, రాజారత్నం, గాండ్ల లక్ష్మన్న, చిదంబరరెడ్డి పాల్గొన్నారు.

● నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయంలో అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ ఎన్టీయార్ విగ్రహానికి నివాళి అర్పించారు.

● టీడీపీతోనే బీసీలకు అభివృద్ధి ఫలాలు అందుతాయని, ఎన్టీయార్ హయాంలోనే నాయీ బ్రాహ్మణులకు ఫెడరేషన్ ఏర్పాటు చేస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి రుణాలు, 90 శాతం సబ్సిడీతో పనిముట్లు ఇచ్చారని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివ అన్నారు. నగరంలోని ఎస్వీఆర్ సమావేశ హాలులో జరిగిన నాయీ బ్రాహ్మణ సంఘ నాయకుల సమావేశంలో ఆయన ఎన్టీయార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు విజయకుమార్, పెద్ద స్వాములు, పర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**కోడుమూరు:** టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు వర్ధంతిని పురస్కరించుకొని శనివారం బృందావనం హోటల్ ముందు టీడీపీ నాయకులు బడేసాగౌడ్, గోపాల్‌నాయుడు, బ్రిటీష్‌రాముడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ నాయకు లు మునిస్వామి, నారాయణ, క్రిష్ణ, మధు, రాముడు పాల్గొన్నారు.

**కోడుమూరు రూరల్:** మండలంలోని అమడగుంట్ల, గోరంట్ల గ్రామాల్లో టీడీపీ శ్రేణులు దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు పార్లమెంటు కార్యదర్శి మాదన్న, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ సుంకన్న, గోరంట్ల మధుసూధన్‌నాయుడు, అయ్యన్న, బడేసాహెబ్, మిన్నల్ల, మౌలాలి, దాసు, ఈరన్న, రాజు పాల్గొన్నారు.

**గూడూరు:** ఎన్టీ రామారావుకు భారతరత్న ఇవ్వాలని మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్రగోపాల్ నాయుడు అన్నారు. శనివారం గూడూరులో ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రేమట సురేష్, బుడ్డంగలి, టీడీపీ నాయకులు రేమట వెంకటే శ్వర్లు, సృజన్, పౌలు, దానమన్న, నాగప్ప యాదవ్, షేక్షావలి, చాంద్ బాషా, తెలుగు శ్రీనివాసులు, కలాం, విజయకుమార్, మన్సూర్, రవి పాల్గొన్నారు.

● మండలంలోని మునగాల గ్రామంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు నాయకులు కుంటిచేతి గోపాల్, రామచంద్రుడు, మద్ది లేటి, రవి, ప్రతాప్, అంజి, రమేష్ రెడ్డి, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

● ఆర్.కానాపురం గ్రామంలో మండల తెలుగుయువత అధ్యక్షుడు సుమన్‌బాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిస్వామి, సుంకిరెడ్డి, చిన్న నరసింహులు పాల్గొన్నారు.

**సి.బెళగల్:** మండల కేంద్రమైన సి.బెళగల్‌లో ఎన్‌టీఆర్ వర్ధంతిని టీడీపీ మాజీ మండల కన్వీనర్ పాండురంగన్నగౌడు ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, సర్పంచులు, ఎంపీటీసీ పాల్గొన్నారు.


కోడుమూరులో..


అమడగుంట్లలో..


గూడూరులో..

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కల్లూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల్లో భాగంగా నన్నూరు 400 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం. ఉమాపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో 400 కేవీ నన్నూరు సబ్‌స్టేషన్ నుంచి 220 కేవీ కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపంలోని సబ్‌స్టేషన్ వరకు ఉన్న 220 కేవీ సర్క్యూట్ సామర్థ్యం పెంచేందుకు పనులు జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 132 కేవీ కర్నూలు, 132 కేవీ గూడూరు, 132 కేవీ ఎమ్మిగనూరు, 132 కేవీ మాధవరం 132 కేవీ పత్తికొండ సబ్‌స్టేషన్ల పరిధిలో గల వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈఅసౌకర్యాన్ని గుర్తించి రైతులు, వినియోగదారులు విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

● **కల్లూరు ఎస్టేట్ సెక్షన్‌లో :** విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ సెక్షన్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ ఈఈ టి.శేషాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విఠల్‌నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉద యం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కల్లూరు, చెన్నమ్మసర్కిల్ ప్రాంతాల్లో కరెంట్‌కోత ఉంటుందని సూచించారు.

## రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

**గూడూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామాంజనేయులు సూచించారు. శనివారం చనుగొండ్లలో రీసర్వేపై గ్రామ సభ నిర్వహించారు.

**కోడుమూరు రూరల్:** మండలంలోని ఎర్రదొడ్డిలో భూముల రీసర్వేపై శనివారం రెవెన్యూ సిబ్బంది అవగాహనా ర్యాలీ, గ్రామసభ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్ నాయక్ మాట్లాడు తూ ఈ నెల 21 నుంచి గ్రామంలో భూముల రీసర్వే జరుగుతుందని అన్నారు.

**సి.బెళగల్:** రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

## గ్రేడ్-1 ఎలక్ట్రీషియన్‌పై దాడి

**కర్నూలు హస్పిటల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గ్రేడ్-1 ఎలక్ట్రీషియన్ వీరస్వామిపై ఓ ఉద్యోగి దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మూడు రోజుల క్రితం పాత రేడియాలజి విభాగం వద్ద కొత్తగా ఏర్పాటు చేస్తున్న హెల్త్ వెల్‌నెస్ సెంటరులో ఎలక్ట్రికల్ పనుల విషయంలో గ్రేడ్-1 ఎలక్ట్రీషియన్ వీరస్వామి ఆ ఉద్యోగి మధ్య వాదన జరిగింది. పనులు మాకు సంబంధించినవి అని, ఈ విషయంలో జోక్యం తగదని చెప్పగా, ఆయనపై దాడి చేశారు.

# రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యం: ఎంపీ




పంచలింగాలలో రోడ్లను శుభ్రం చేస్తున్న ఎంపీ నాగరాజు, 19వ వార్డులో మురుగు కాలువలో చెత్తను తొలగిస్తున్న మల్లెల రాజశేఖర్, రోడ్లను శుభ్రం చేస్తున్న కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది

**కర్నూలు రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రంగా ఉంచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి ఎంపీ హాజరయ్యారు. పాఠశాల ఆవరణంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి చెత్తచెదారాన్ని తొలగించారు. అంతకముందు గ్రామంలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో రఘునాథ్, పంచాయతీ కార్యదర్శి, టీడీపీ నాయకులు గొల్లకృష్ణ పాల్గొన్నారు.

● కర్నూలు మండలం బి. తాండ్రపాడు గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి సర్పంచు ఆకెపోగు జయన్న పాల్గొన్నారు. గ్రామంలో పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు.

**కర్నూలును స్వచ్ఛ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుదాం: మల్లెల**

కల్లూరు: కర్నూలు నగరాన్ని స్వచ్ఛ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దాలని నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 19వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ ప్రభాకర్‌యాదవ్, కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డితో కలిసి ఆయన స్వచ్ఛ ఆంధ్రా..స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొ న్నారు. గణేష్‌నగర్ కాలనీల్లో ఆయన పారిశుధ్య కార్మికులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో పాణ్యం వాణిజ్య విభా గం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

● **పెద్దటేకూరులో:** స్వచ్ఛ ఆంధ్రా..స్వచ్ఛదివస్‌లో భాగంగా కల్లూరు మండలం పెద్దటేకూరులో స్పెషల్ ఆఫీసర్ దీప్తి, డీఎల్‌డీఓ రమణారెడ్డి పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సర్పంచు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

● **నాయకల్లులో:** కల్లూరు మండలం నాయకల్లులో పంచాయతీ కార్యదర్శి శేషన్న ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్రా..స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు.

**కర్నూలు న్యూసిటీ:** సీ.క్యాంపు కూడలిలో నగర పాలక సంస్థ అధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ రవీంద్రబాబు, రెండో బెటాలియన్ డీఎస్పీ మహబూబ్‌బాషా, పర్యావరణ నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిశోర్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. సి. క్యాంపు కూడలిలో మానవహారం నిర్వహించి, అందరిచే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయిం చారు. అనంతరం వ్యాపారులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించడం తో పాటు బీక్యాంపు ప్యాకెట్ పార్కులో స్వచ్ఛత పనులు చేశారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డా.కే. విశ్వేశ్వరరెడ్డి, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

● జిల్లా పరిషత్ ఆవరణలో జడ్పీ పరిపాలన భవన ఉద్యోగులంతా స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో పాల్గొని చెత్తను తొలగించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారులు సి.మురళీమో హన్‌రెడ్డి, జితేంద్ర, బసవశేఖర్ నాగరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

**కర్నూలు అర్బన్:** స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు అన్నారు. శనివారం నగరంలోని 31వ వార్డులో వార్డు ఇన్‌చార్జి వి. శైలజా ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

**కర్నూలు ఎడ్యుకేషన్:** జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎస్ఏ ఏపీసీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది కార్యాలయాన్ని శుభ్ర పరిచారు. అలాగే డీఈవో కార్యాలయ పరిసరాలను ఉద్యోగులు చెత్తచె దారాన్ని తొలగించారు.

**కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్:** పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుని సామాజిక బాధ్యత అని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం పర్యావరణ ఇంజనీరు కిషోర్‌రెడ్డి అన్నారు. శనివా రం స్వచ్ఛ దివస్‌లో భాగంగా కార్యాలయంలోని పలు విభాగాలు, పరిసరాలను సిబ్బందితో కలిసి శుభ్రపరిచారు. అనంతరం సిబ్బం దితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కాలుష్య నియం త్రణ మండలి అధికారులు శ్యాంసుందర్, వీరేంద్రకుమార్, నరసిం హులు, సుధాకర్ పాల్గొన్నారు.

**సి.బెళగల్:** మండల కేంద్రంలో సర్పంచ్ పాండురంగన్న అధ్యక్షతన స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి శ్యామల, అధికారులు గ్రామంలో చెత్త దిబ్బలను తొలగించారు.

**కర్నూలు కలెక్టరేట్:** కలెక్టర్ ప్రాంగణంలో జిల్లా అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల ముందు పరిసరాల ప్రాంతాల్లో ఉన్న చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచారు.

**కర్నూలు అగ్రికల్చర్:** స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం రైతుబజారుల్లో సీ.క్యాంపు ఎస్టేట్ అధికారి హరీష్ కుమా ర్, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్, అమీన్ అబ్బాస్ నగర్ ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, కొత్తపేట ఎస్టేట్ అధికారి లక్ష్మీదేవమ్మ, ఆదోని నంద్యాల రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు, సెక్యూరిటీ గార్డులు రైతు బజార్లలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.



## స్వచ్ఛ దివస్‌లో ప్రొటోకాల్ వివాదం

**గూడూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య ప్రొటోకాల్ వివాదం తలెత్తింది. శనివారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయం అధికారులు స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతి థులుగా కలెక్టర్ పి.రంజిత్ బాషా, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. అయితే స్టేజీపై కలెక్టర్, ఎమ్మెల్యే, జిల్లా అధికారులతోపాటు నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్మన్లకు కుర్చీ లు ఏర్పాటు చేసి కౌన్సిలర్లకు, టీడీపీ ప్రజా ప్రతినిధులకు కుర్చీలు స్టేజీపై ఏర్పాటు చేయకపోవడంతో టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్టేజీపై వైస్ చైర్మన్లకు కుర్చీలు ఏర్పాటు చేయడం పట్ల టీడీపీ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు కమిషనర్‌ను ప్రశ్నించారు. దీంతో ఒక్కసారిగా వివాదం చోటు చేసుకోంది. కమిషనర్ తీరుపై టీడీపీ ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రజా ప్రతినిధులకు స్టేజీపై కుర్చీలు వేయకపోగా, వైస్ చైర్మన్లకు స్టేజీపై కుర్చీలు ఎలా వేస్తారని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. దీంతో వైస్ చైర్మన్లు, టీడీపీ నాయకుల మధ్య మాట మాట పెరగడంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకోని కలెక్టర్ సమక్షంలో ఇలా వివాదం చేయడం సరికా దని సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

## వ్యక్తికి తీవ్ర గాయాలు

**ఓర్వకల్లు జనవరి 18, (ఆంధ్ర జ్యోతి):** కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై శనివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన గువ్వ రవికుమార్ ఓర్వకల్లులో పొగాకు కంపెనీ వద్దకు బైక్‌పై వెళ్తుండగా. గుట్టపాడు స్టేజీ వద్ద నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడి పరిస్థితి విషమంగా ఉంది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవికుమార్‌ను టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజ శేఖర్, మండల తెలుగు యువత అధ్యక్షుడు రాము, మాజీ కాల్వ బుగ్గ చైర్మన్ సుధాకర్‌లు పరామర్శించారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

**కోడుమూరు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ప్యాలకుర్తి-కొత్తూరు గ్రామాల మధ్య జరిగిన రెండు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. ఆలూరు నుంచి హైదరాబాదుకు పశుగ్రాసం బ్యాగులతో వెళ్తున్న ఐచర్ లారీ శనివారం తెల్లవారు జామున ప్యాలకుర్తి దాటాక మిట్ట సమీపంలో ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న వేగంగా వస్తున్న కారును తప్పించబోయి పొలాల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడినట్లు తెలిసింది. అలాగే మధ్యాహ్నం బైక్, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. గోనెగండ్ల మండలంలోని లింగందిన్నె గ్రామానికి చెందిన సుభహాన్ తన కూతుళ్లకు జ్వరం రావడంతో ఆసుపత్రికి కర్నూలు బయలుదేరాడు. అయితే ప్యాలకుర్తి మిట్ట దాటాక ఎదురు గా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో సుభహాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఇద్దరు కూతుళ్లు షెహరాబాను, ఫరీదా గాయపడ్డారు. దీంతో వారిని ఆసుపత్రికి తరలించారు.

## మద్యం విక్రేత అరెస్టు

ఆదోని రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన గడ్డి గాదెప్ప మద్యం విక్రయిస్తుండగా ఇస్వి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం నిందితుడి నుంచి రెండు బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు.

## పేదల కోసం పని చేయాలి

మద్దికెర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కేఈ పేదల కోసం పనిచేయాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సూచించారు. శనివారం మండలంలో కేఈ యువసేన స్వచ్ఛంద సంస్థ బుక్‌ను ఆవిష్కరించారు. స్వచ్ఛంద సంస్థను ప్రారంభించడం అభినందనీయమని, అనాథ బాలబాలికల, వికలాంగులు, వృద్ధులు మహిళల సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలని, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలను సంస్థ నిర్వహించాలన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు పి.పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్నయాదవ్ ఉన్నారు.

## విధులకు గైర్హాజరైతే వేటు తప్పదు

ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్


రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సబ్ కలెక్టర్

ఆదోని రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది విధులకు గైర్హాజరైతే వేటు తప్పదని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ హెచ్చరించారు. శనివారం తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి గోనబావి సచివాలయాలన్ని తనిఖీ చేశారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమయ పాలన పాటించాని సూచించారు.

## ధ్యానంతో మానసిక ప్రశాంతత


మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. శనివారం పట్టణంలోని ఓం శాంతి ఆశ్రమంలో మాట్లాడారు. ధ్యానం చేయడం వల్ల మనసు మన అధీనంలో ఉండి చెడు వ్యసనాలకు దూరంగా ఉండవచ్చునన్నారు. నిర్వాహకులు లక్ష్మి, కన్వీనర్ కురువ మల్లికార్జున, కో కన్వీనర్ అరికేర వీరేష్, వార్డ్ మెంబర్ జీర గౌడప్ప, తుంబలబీడు సర్పంచ్ మల్లికార్జున పాల్గొన్నారు.

## కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించాలి


మద్దికెరలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మద్దికెర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించాలని వైద్యాధికారి రాగిణి సూచించారు. శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల నుంచి జాతీయ కుష్ఠు నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. 2వ తేదీ వరకు సర్వే ఉంటుందన్నారు. చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, కనురెప్పలపై వెంట్రుకలు రాలిపోవడం, అరచేయి, అరికాళ్లలో స్పర్శలేకుంటే కుష్ఠుగా గుర్తించాలన్నారు. ప్రతి మూడో శనివారం గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నిరంజన్‌బాబు, మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశులు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, లెప్రసీ నోడల్ అధికారి కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మాట నిలుపుకున్న ఎమ్మెల్యే కేఈ

మద్దికెర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట నిలబెట్టుకున్నారని తాలుకా తెలుగు యువత అధ్యక్షులు ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్, టైలర్ హరి అన్నారు. ఎన్నికలల్లో శ్యాంబాబు ఇచ్చిన హామీ మేరకు స్థానిక సాయినగర్ కాలనీలో సీసీ రోడ్డును శనివారం నిర్మించారన్నారు. మండలంలో దాదాపు రూ.2 కోట్లకు పైగా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేశామన్నారు.

## జామ తోట దహనం


దహనమైన జామ తోట

దేవనకొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సోమన్నకు చెందిన జామ తోట దహనమైంది. బాధితుడి కథనం మేరకు.. తన మూడు ఎకరాల పొలంలో జామ, మామిడి, కొబ్బరి మొక్కలను సాగు చేస్తున్నాడు. రెండు రోజులుగా తాను ఊర్లో లేకపోవడంతో సమీప పొలాలకు చెందిన కొందరు వ్యక్తులు వ్యక్తిగత కక్షలతో తోటకు నిప్పుపెట్టినట్లు, ఈ మేరకు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశానని, రూ.10లక్షల ఆస్తి నష్టం వచ్చిందని బాధితుడు వాపోయాడు.

## క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరం

ఆదోని అగ్రికల్చర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరమని వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ అన్నారు. శనివారం పట్టణంలోని దుబ్బగణపతి ఆలయ ఆవరణలో నిర్వహించిన కబడ్డీ పోటీలు ముగిశాయి. సీఐ శ్రీరామ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విజేత బావాజీ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.20వేలు నగదు, రన్నర్స్ ఎస్‌జేవీ వాల్మీకి నగర్ జట్టుకు రూ.15వేలు, మూడో స్థానంలో వచ్చిన మాన్వి జట్టుకు రూ.10వేలు, నాలుగో స్థానంలో నిలిచిన తక్కలకోట జట్టుకు రూ. 5వేలు అందజేశారు. బాలాజీ, రామన్న, అమర్ ప్రకాష్, నాగేంద్రప్ప పాల్గొన్నారు.

# బడుగుల ఆశాజ్యోతి ఎన్టీఆర్

- ఎమ్మెల్యే శ్యాంబాబు
- పత్తికొండ, వెల్దుర్తిలో రక్తదానం
- పత్తికొండ, ఆదోని, ఆలూరు నియోజకవర్గాల్లో ఎన్టీఆర్‌కు నివాళులు


పత్తికొండలో రక్తదానం చేస్తున్న తుగ్గలి నాగేంద్రతో ఎమ్మెల్యే శ్యాంబాబు


దేవనకొండలో నివాళి అర్పిస్తున్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ


ఆలూరులో పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న వీరభద్ర గౌడ్


ఆదోనిలో నివాళి అర్పిస్తున్న ఉమాపతి నాయుడు


ఆలూరులో నివాళి అర్పిస్తున్న వైకుంఠం శివప్రసాద్, జ్యోతి

పత్తికొండ టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బడుగుల ఆశాజ్యోతి ఎన్టీఆర్ అని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. టీడీపీని స్థాపించిన కొన్ని నెలలకే అధికారంలోకి చ్చారని, పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాని కొనియాడారు.

**రక్తం దానం అలవాటు చేసుకోవాలి**

రక్తదానం చేయడాన్ని అలవాటుగా మార్చుకోవాలని ఎమ్మెల్యే శ్యాంబాబు సూచించారు. పార్టీ కార్యాలయంలో డా.కల్పన పర్యవేక్షణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 150 మందికి పైగా నాయకులు, యువకులురక్తదానం చేశారు. పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర కూడా రక్తదానం చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, బత్తిన వెంకట్రాముడు, బత్తిన లోక్‌నాథ్, హోటల్ శ్రీనివాసులు, తిమ్మయ్య చౌదరి, రామానాయుడు, మనోహర్ చౌదరి, కడవల సుధాకర్, బీటీ గోవిందు, ఈశ్వరప్ప, తిప్పన్న, ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు అడ్వకేట్ సురేష్ కుమార్, సింగం శ్రీను, సోమలింగ, బ్రహ్మయ్య, వెంకటపతి, చిన్నహుల్తి రంగయ్య పాల్గొన్నారు.

**వృద్ధులకు అన్నదానం**

పట్టణంలోని వృద్ధాశ్రమంలో ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు అడ్వకేట్ సురేష్ ఖుమార్, ఎన్‌టీకే ఫ్యాన్స్ సింగం శీను సారధ్యంలో అన్నదానం నిర్వహించారు. సాంబశివారెడ్డి, తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి, తిమ్మయ్య చౌదరి పాల్గొన్నారు.

**వెల్దుర్తి టౌన్:** ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీ కార్యాలయంలో రక్తదానం చేశారు. మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు, బలరాం గౌడ్, రమాకాంత్ రెడ్డి, అమర్నాథ్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

**తెలుగుదనానికి ప్రతిరూపం ఎన్టీఆర్**

**ఆదోని:** తెలుగుదనానికి ఎన్టీఆర్ ప్రతిరూపమని కురవ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. తెలుగు జాతి ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేసిన నాయకుడని, రాజకీయాలకు కొత్త నిర్వచనం చెప్పారన్నారు. రామస్వామి, శ్రీనివాస ఆచారి, నీలకంఠప్ప, సాదికాబేగం, అప్పర్ బాషా, ధనాపురం శేషన్న పాల్గొన్నారు.

**ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి**

ఆలూరు: ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, నాయకురాలు వైకుంఠం జ్యోతి అన్నారు. శనివారం ఎన్టీఆర్‌కు నివాళి అర్పించి, ఆయన సేవలను కొనియాడారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కురువ జయరాం, టీడీపీ నాయకులు ప్రకాశ్, గోవింద్, రెహమాన్, విశ్వ పాల్గొన్నారు.

**రామారావు సేవలు చిరస్మరణీయం..**

బడుడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. పార్టీ కార్యాలయంలో నివాళి అర్పించారు. అనంతరం రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. రాంనాథ్ యాదవ్, కన్వీనర్ అశోక్, నరసప్ప, కొమ్ము రామాంజినేయులు, గుండయ్య, రవి యాదవ్, కొమ్ము రాజు, డా.నెట్టప్ప, పటేల్ యాదవ్, గుల్యం రామాంజినేయులు, రాము యాదవ్, వన్నూరు వల్లి, ఈరన్న పాల్గొన్నారు.

**ఆస్పరి:** మాజీ ఎంపీపీలు బిల్లేకల్లు వెంకటేశు, కృష్ణ యాదవ్, మాజీ కన్వీనర్ ఎస్ తిమ్మన్న, సతీష్ కుమార్ యుగంధర్, ఎంపీటీసీ నరసప్ప, సంజన్న, అట్టేకల్లు రాజశేఖర్, సుదర్శన్ యాదవ్ పాల్గొన్నారు.

**ఆలూరు రూరల్:** బడుగుల అభ్యున్నతికి ఎన్టీఆర్ కృషి చేశారని టీడీపీ రైతు కమిటీ కార్యదర్శి నారాయణ రెడ్డి అన్నారు. ముద్దనగేరి గ్రామంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. కమ్మరచేడు డాక్టర్ ఇబ్రహీం, ముద్దనగేరి సర్పంచ్ సుధాకర్ రెడ్డి, గోపి, శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

**జాతీయ స్థాయిలో తెలుగువారి గౌరవం నిలిపిన ఎన్టీఆర్**

**దేవనకొండ:** జాతీయ స్థాయిలో తెలుగువారి గౌరవాన్ని ఎన్టీఆర్ నిలిపారని వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, బడిగింజల రంగన్న అన్నారు. దేవనకొండలో ఎన్టీఆర్‌కు నివాళి అర్పించారు.

**హాలహర్వి:** ఎన్టీఆర్‌కు టీడీపీ అధికార ప్రతినిధి కృష్ణమనాయుడు నివాళి అర్పించారు. సర్పంచ్ మల్లికార్జున, శ్రీధర్, జెహోసల్లి సాగునీటి సంఘం అధ్యక్షుడు మల్లన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

## పుల్లగుమ్మిలో లేగదూడల ప్రదర్శన

వెల్దుర్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లగుమ్మి గ్రామం పశువైద్యశాలలో శనివారం లేగదూడల ప్రదర్శనను పశువైద్యాధికారి స్వాతి నిర్వహించారు. డీడీ దుర్గాప్రసన్నబాబు, డీఎల్‌డీఏ రాజశేఖర్, ఏడీ పార్థసారధి మాట్లాడారు. పశువుల గర్భధారణకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. పశువైద్యాధికారులు శాంతలత, చంద్రమోహన్ పాల్గొన్నారు.

## 68 చెరువులను నీటితో నింపాం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

వెల్దుర్తి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామిమేరకు నియోజకవర్గంలో 68 చెరువులకు నీటిని నింపామని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. రూ.22.50 లక్షలతో పోలీస్‌స్టేషన్ నుంచి సంతబజార్ వరకు, రూ.10 లక్షలతో సంతబజార్ నుంచి అమ్మవారిశాల వరకు నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కల గొట్ల గ్రామంలో సీసీ రోడ్డును ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే మండలాన్ని అభివృద్ధి చేశామన్నారు. సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడు, బలరాంగౌడు, రమాకాంత్‌రెడ్డి, రామకృష్ణాచారి, సుధాకర్‌గౌడు, రామకృష్ణ, పుల్లయ్య, మద్దిలేటి, ఈదుల వెంకటరాముడు, ఎమ్మార్వో చంద్రశేఖరవర్మ, ఎంపిడీవో సుహాసినమ్మ, ఏపివో లక్ష్మన్న, పిఆర్ఏఈ మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డుతో ఆదాయం

ఆలూరు, జనవరి18 (ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డుల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకురుస్తామని డీపీవో భాస్కర్ తెలిపారు. శనివారం పట్టణంలోని డంపింగ్ యార్డును పరిశీలించారు. డీఎల్‌పీవో వీరభద్రప్ప, ఈవో ప్రభాకర్ రావ్ పాల్గొన్నారు.

## బసరకోడులో తాగునీటి కష్టాలు


తాగునీటి కోసం బిందెలను క్యూలో పెట్టిన గ్రామస్థులు

ఆదోని రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసరకోడు గ్రామంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. వేసవి రాకమునుపే తాగునీటి సమస్య మొదలడవడంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. నెలకు రెండుసార్లు మాత్రమే తాగునీరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం నీరు రావడంతో కొళాయి వద్ద బారులు తీరారు. సమస్యను తీర్చాలని కరుతున్నారు.

## వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి

దేవనకొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మాన్యం భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మయ్య, సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం బ్యాంకు వద్ద ధర్నా చేసి, అనంతరం ఏపీజీబీ మేనేజరు రామకృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. కండప్ప, శేఖర్, కృష్ణ, మనోహర్ పాల్గొన్నారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్'లో ప్రజాప్రతినిధులు, అధికారులు


ఆదోనిలో వీధిని శుభ్రం చేస్తున్న కమిషనర్ కృష్ణ, చైర్‌పర్సన్ శాంత


హాలహర్విలో చెత్త ఎత్తి వేస్తున్న అధికారులు

ఆదోని రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాలనీలను చెత్త రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ సూచించారు. శనివారం మండిగిరి పంచాయతీ పరిధిలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించారు. తహసీల్దార్ శివరాముడు, ఏపిఓ సూర్యప్రకాష్, కార్యదర్శి చంద్రశేఖర్, వెల్లాల మధుసూదన్ శర్మ, విట్టా రమేష్, కల్లుబోతుల సురేష్ పాల్గొన్నారు.

**పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం : ఎమ్మెల్యే శ్యాంబాబు**

**పత్తికొండ టౌన్:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం పత్తికొండలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నాలుగు స్థంభాల కూడలి ప్రాంతంలో ఆర్డీవో భరత్ నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పొరక పట్టి రోడ్లను శుభ్రం చేశారు. ఎంపీడీవో సువర్ణలత, ఈవో నరసింహులు పాల్గొన్నారు.

**పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం**

**ఆదోని టౌన్:** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ వాల్మీకి శాంత, కమిషనర్ కృష్ణ అన్నారు. పట్టణంలోని జేఎల్‌బీ మార్కెట్‌లో చెత్తను తొలగించారు. పట్టణంలోని అన్ని సచివాలయాల్లో సిబ్బంది శుభ్రం చేశారు. ఎంఈ చలపతి, పారిశుద్ధ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

**హాలహర్వి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా మారుద్దామని ప్రత్యేక అధికారి రామంజినేయులు సూచించారు. శనివారం హాలహర్విలో చెత్తను ఎత్తివేశారు. ఎంపీడీవో వరలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

**మద్దికెర:** ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ హుసేన్ సాహెబ్, సర్పంచ్ బండారు సుహాసిని, ఎంపీపీ అనిత, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, కార్యదర్శి శివకుమార్, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, ల్యాబ్‌టెక్నీషియన్ విజయ్ తదితరులు ఉన్నారు.

**దేవనకొండ:** పరిసరాల స్వచ్ఛతకు పాటుపడాలని ఎంపీడీవో గౌరీదేవి, వైద్యాధికారి కళ్యాణ్, రంగన్న, మలకన్న, మల్లికార్జున అన్నారు. బస్టాండ్ అవరణలో ప్రతిజ్ఞ చేశారు.

**ఆలూరు:** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, పత్తికొండ డివిజనల్ పంచాయతీ అధికారి వీరభద్రప్ప అన్నారు. శనివారం అంబేద్కర్ కూడలిలో రోడ్లు శుభ్రం చేశారు. సంత మార్కెట్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ, ఈవో ప్రభాకర్ రావ్, టీడీపీ నాయకులు రాంనాథ్ యాదవ్, అట్టేకల్ జగన్ మోహన్ బాబు, రఘు ప్రసాద్ రెడ్డి, అశోక్, గుండయ్య, రామకృష్ణ సోమశేఖర్, ఈరన్న, వన్నూరు వల్లి, గుల్యం రామాంజినేయులు పాల్గొన్నారు.

## మాజీ లస్కర్ మృతి

హొళగుంద, జనవరి18 (ఆంధ్రజ్యోతి) : గ్రామానికి చెందిన ఎల్ఎల్‌సీ కాలువ మాజీ లస్కర్ బ్రహ్మయ్య (63) శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాల మేరకు.. రెండు నెలలుగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతూ, కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కోలుకోలేక శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. భార్య శాంతమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎల్లెల్సీ డీఈ, ఏఈ ఈశ్వరయ్య, లస్కర్లు సంతాపం తెలిపారు.

## నాణ్యమైన ఆహారం అందించాలి

ఆదోని టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు న్యామైన ఆహారాన్ని అందించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని మునిసిపల్ కమిషనర్ కృష్ణ సూచించారు. శనివారం భోజన సమయంలో పట్టణంలోని నిర్మల్ టాకీస్ ఎదురుగా అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. భోజనాన్ని రుచి చూసి, భోజనం చేస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఆదోని అగ్రికల్చర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ ప్రధాన కార్యదర్శి రామశేషయ్య కోరారు. శనివారం పట్టణంలోని ఉపాధ్యాయులకు బీటీఏ క్యాలెండర్ డైరీని అందజేశారు. బహుజన ఉపాధ్యాయ ఉద్యమాన్ని నడిపించడంలో ఉపాధ్యాయినుల పాత్ర కీలకమైంది అన్నారు. భారత ప్రథమ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి ఆలోచన విధానంతో పనిచేయడం గర్వించదగ్గ విషయన్నారు. ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలను, రిటైర్ అయిన వారికి చెల్లించాల్సిన పెన్షన్, గ్రాడ్యుటీ సమస్యలను పరిష్కరించాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు సర్వోజీరావు విజయలక్ష్మి బాయి, నాగ పరిమళాబాయి, ప్రవీణ పాల్గొన్నారు.

## అధ్యాపక వృత్తి గౌరవప్రదమైనది


సుమాల చిన్నదుర్గప్పను సన్మానిస్తున్న స్నేహితులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అధ్యాప వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద అన్నారు. శనివారం అరుణోదయ పాఠశాల ఆవరణలో పట్టణవాసి దువ్వూరు ఎస్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ సుమాల చిన్నదుర్గప్ప డాక్టరేట్ పట్టా అందుకోవడంతో స్నేహితులు ఆయనను సన్మానించారు. అంబేద్కర్ స్ఫూర్తితో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతూ పరిశోధన చేసి డాక్టరేట్ పట్టాను అందుకోవడం శుభ పరిణామన్నారు. దళిత గ్రామీణ కుటుంబం నుంచి సవాళ్ల మధ్య విద్యాభ్యాసం చేసి ప్రిన్సిపాల్‌గా ఇండియా పాకిస్తాన్ సంబంధాలు- ద్వైపాక్షిక శాంతి ప్రక్రియపై పరిశోధన చేయడం అభినందనీయమన్నారు. నాగన్న, దేవ సహాయం, వెంకటేశ్వర్లు, భోజరాజు, దశరథ రాముడు, రామ లింగ పాల్గొన్నారు.

# ఎన్టీఆర్‌కు ఘన నివాళి

**మంత్రాలయం జనవరి 18(ఆంధ్రజ్యోతి):** ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానాయకుడు తెలుగుపార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ సీఎం ఎన్టీరామారావు అని పార్టీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రాఘవేంద్ర సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు రాకేష్ రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, అశోక్ రెడ్డి, ఎస్ఎం గోపాల్ రెడ్డి, లక్ష్మన్న, సాగునీటి సంఘం ప్రెసిడెంట్లు చంద్ర, నరసింహులు, డిసీ తిమ్మప్ప, వగరూరు పవన్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, గోపాల్, మేకల నరసింహులు భీమయ్య, రాగన్న, జయరాముడు, భీమిరెడ్డి, ముత్తురెడ్డి, వెంకట్రాముడు, నాగన్న, పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ చెరగని ముద్ర: శ్రీనివాసరెడ్డి**

ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా చెరగని ముద్ర వేసుకున్న మహానాయకుడు ఎన్టీరామారావు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు పన్నగ వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా శ్రీమఠం మధ్వమార్గ్ కారిడార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అక్కడున్న అనాథలు, దివ్యాంగులు, వృద్ధులకు పండ్లు, పాలు, బెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఎల్లారెడ్డి, విజయరామిరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, అబ్దుల్లా, సోల్మాన్ రాజు, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి యేబు, గువ్వల భీమన్న, సుజ్ఞానం, అండే హనుమంతు, నరసింహులు, దేవదాసు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఎమ్మిగనూరు రూరల్:** తెలుగు ఖ్యాతిని ప్రపంచ నలుమూలలా చాటి చెప్పిన యుగ పురుషుడు ఎన్టీఆర్ అని టీడీపీ నాయకులు కొనియాడారు. శనివారం స్థానిక తహసీల్దార్ ఆవరణలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పట్టణం, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 168 మంది రక్తదానం చేశారు. వీరికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శంకరయ్య, గురురాజదేశాయ్, టీడీపీ నాయకులు డీలర్ ఈరన్న, వీరాంజనేయులు, కె.టి వెంకటేశ్వర్లు, సురేష్‌చౌదరి, నరసన్న గౌడు, జగదీష్, రాఘవేంద్ర, గాజులదిన్నె హనుమంతు, రాందాసుగౌడు, మిఠాయి నరసింహులు, రామకృష్ణనాయుడు, జహంగీర్, రంగస్వామిగౌడు, బచ్చాల రంగన్న, బందెనవాజ్, నజీర్, ఎస్సీ రామాంజనేయులు, దరగల మాబు, బేతాలబడేసాహెబ్, భార్గవ్‌రెడ్డి, పొనకలదిన్నె శ్రీరాములు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఎమ్మిగనూరు పట్టణంలోని సోమేశ్వర సర్కిల్‌లో ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నందమూరి ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షులు తెలుగు రాముడు, టీస్టాల్ చంద్ర, రమేష్‌తో పాటు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో నందమూరి ఫ్యాన్స్ గిడ్డయ్య, వీరేష్, వాల్మీకి రాజు పాల్గొన్నారు.

**కౌతాళం:** మండలంలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. కౌతాళంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప స్వగృహంలో పార్టీ శ్రేణులతో కలసి జరుపుకోగా, నూతన టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఉలిగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి మండల నాయకులతో కలసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, మండల అధ్యక్షుడు ఉలిగయ్య, బాపురం మోహన్ రెడ్డి, కోట్రేష్‌గౌడ్, దొడ్డనగౌడ్, కురుగోడు తెలుగు రైతు సంఘం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, నాయకులు రమేష్‌గౌడ్, రాజబాబు, సిద్దు, రహిమాన్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**గోనెగండ్ల:** గోనెగండ్లతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్టీఆర్ 29వ వర్ధంతిని శనివారం ఘనంగా టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. గోనెగండ్లలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ నజీర్, తిరుపతయ్య, రమేష్‌నాయుడు, నూరహమ్మద్, మిన్నల్ల, రంగస్వామినాయుడు, బేతాలబడేసా, రామాంజినేయులు,భారతం రహంతుల్లా, ఫకృద్దీన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పెద్దకడుబూరు:** మండలంలో ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ నాయకులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ టీడీపి రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బసలదొడ్డి ఈరన్న, నాయకులు మల్లికార్జున, మీసేవ ఆంజినేయులు, వీరేష్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, సత్యన్న గౌడ్, తలారి అంజి, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కోసిగి:** ఎన్టీ రామారావు 29వ వర్ధంతి సందర్భంగా తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్‌రెడ్డి కోసిగిలోని ఎస్బీఐ బ్యాంకు సమీపంలో టీడీపీ జెండా ఎగురవేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భరద్వాజశెట్టి, పంపాపతి, నాడిగేనిమాదేవ, డీలర్ నర్సన్న, నర్సారెడ్డి, రామాంజనేయులు, వీరారెడ్డి, ఈరెడ్డి తదితరులు ఉన్నారు.

● రాజకీయంగా బడుగు బలహీనవర్గాల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి బీసీలకు రాజకీయ భిక్ష పెట్టింది నందమూరి తారక రామారావు అని జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. శనివారం కోసిగిలోని తేరుబజారు వద మండల కన్వీనర్ జ్ఞానేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాడిగేని అయ్యన్న, చిన్నతాయన్న, వక్రాణి వెంకటేష్, అయ్యప్ప, కురువ అయ్యన్న, గోపాల్, మదిరి వీరారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, నరసింహులు, చింతలగేని నర్సారెడ్డి, ఖలందర్ పాల్గొన్నారు.


మంత్రాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, నాయకులు


ఎమ్మిగనూరులో రక్తదానం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు


కౌతాళంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు


గోనెగండ్లలో..



కోసిగిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు


పెద్దకడబూరులో..


ఎమ్మిగనూరులో..

## వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

### పార్టీ కండువా వేసి ఆహ్వానించిన శ్రీనివాసరెడ్డి


సూగూరు వైసీపీ నాయకులకు పార్టీ కండువా వేస్తున్న టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి

**మంత్రాలయం జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం మండలంలోని సూగూరు, మంత్రాలయం చెందిన దాదాపు వంద మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ భర్త కురువ ఈరన్న, కురువ బసవరాజు, మొండి హనుమంతు వర్గానికి చెందిన దాదాపు వంద మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరికి శ్రీనివాసురెడ్డి, పన్నగ వెంకటేశ్ స్వామి, అమర్నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు యేబు, సోల్మాన్‌రాజు, రాఘవేంద్ర, మన్మథ రెడ్డి, ధర్మరాజు, సుజ్ఞానం, రవి, యేబు పాల్గొన్నారు.

## మంత్రాలయంలో భక్తుల సందడి


మఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

**మంత్రాలయం, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. శనివారం పంచమి కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహరాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**వైభవంగా ప్రహ్లాదరాయల చెక్క రథోత్సవం:** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం పుష్యమాస పంచమి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించారు. అంతక ముందు స్వామి వారికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించి హారతులు నిర్వహించారు.

## రైతు ఉద్యమాలతోనే పశ్చిమ ప్రాజెక్టులు సాధ్యం


మాట్లాడుతున్న నాగన్న

**ఎమ్మిగనూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** రైతుల ఉద్యమాలతోనే జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు సాధ్యమవుతాయని కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత ప్రాజెక్టుల సాధన సమితి కోకన్వీనర్ నాగన్న, రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం యేసేబులు అన్నారు. శనివారం స్థానిక ఏపీఎన్జీవో కార్యాలయ ఆవరణలో పశ్చిమ ప్రాంత ప్రాజెక్టుల సాధన సమితి కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయి పదేళ్లుగా రాయలసీమ మరింత మోసానికి గురవుతూ వస్తుందన్నారు. విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ముఖ్యమంత్రులు ఒత్తిడి తీసుకురాకపోవడం సరైందికాదన్నారు. గోదావరి-పెన్నా నదుల అనుసంధానం వల్ల కర్నూలు పశ్చిమ ప్రాంతానికి ఏ మాత్రం లాభంలేదన్నారు. కర్నూలు పశ్చిమ ప్రాంత ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు నరసప్ప, అనీఫ్, రాజేష్, వీరప్రతాప్, నాగరాజు, జయన్న, స్వామిదాసు, శ్యాంసన్, రాంబాబు, శాంతప్ప, ఉసేనప్ప పాల్గొన్నారు.

## ఆగని వలసలు

### ఒకే రోజు దాదాపు 100కు పైగా కుటుంబాలు తెలంగాణకు..


తెలంగాణకు వలస వెళ్తున్న కూలీలు

**కౌతాళం, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** మండలంలో వలసలు ఆగడం లేదు. శనివారం కౌతాళంలోని బైటిగేరి, ఎన్టీఆర్ నగర్ మండలంలోని తిప్పలదొడ్డి, మదిరె, పొదలకుంట, కాత్రికి నుంచి దాదాపు 100పైగా కుటుంబాలు తెలంగాణకు వలస వెళ్లారు. గ్రామాల్లో పనులు లేకపోవడంతో వలస వలస వెళ్తున్నామని కూలీలు రంగమ్మ, క్రిష్ణయ్య, గంగమ్మ, రామాంజనేయులు తెలిపారు. అధికారులు కూడా వలసలు నివారించేందుకు ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామ కూలీలు వలసలు పోకుండా తగిన పనులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

### వలసల నివారణకు చర్యలు తీసుకోవాలి

**గోనెగండ్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** జిల్లాలో వెనకబడిన ప్రాంతాలలో వలసల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం గోనెగండ్లలో సీపీఎం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమ వెనకబడిన ప్రాంతమని ఈ ప్రాంతానికి ప్రభుత్వం ప్రాజెక్టు కేటాయిస్తామని భూటకపు మాటలు చెప్పి అధికారం చేపట్టిన తర్వాత మరిచిపోతున్నారన్నారు. ప్రాజెక్టు రాక..పనులు లేక బతుకుజీవుడా అంటు కూలీలు, చిన్నకారు రైతు లు వలసలు పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమసమాజ స్థాపనకు కృషి చేసిన నరసింహయ్య 6వ వర్ధంతిని నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, సీపీఎం నాయకులు మునెప్ప, బతకన్న, స్వామి, రామకృష్ణ, నరసింహులు, బంగారాజు, వీరేష్ పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయండి


మంత్రి నాదెండ్ల మనోహర్‌కు పరిమళ ప్రసాదం ఇస్తున్న జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న

**మంత్రాలయం, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు,టూరిజం శాఖా మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌లను మంత్రాలయం జనసేన ఇన్‌చార్జి బీ.లక్ష్మన్న కోరారు. శనివారం అమరావతిలో రాష్ట్ర మంత్రులను కలిసి నియోజకవర్గంలోని సమస్యలు వివరించారు. సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో గ్రామాల్లో పనులు లేక ప్రజలు వలస వెళ్తున్నారని, వలస నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రాఘవేంద్రస్వామి మెమొంటో,పట్టుశాలువ,పరిమళ ప్రసాదం ఇచ్చి సన్మానించారు.

### రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

**ఎమ్మిగనూరు రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** పట్టణంలో 20న జరిగే పెన్షనర్ల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర నాయకులు అబ్దుల్‌కరీం, తాకాలు అధ్యక్షులు ఏపీ వీరన్న కోరారు. శనివారం స్థానిక పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఉప్పర కల్యాణ మండపంలో రాష్ట్ర మహాసభలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో శ్రీనివాసులు, పోలకంటయ్య, కృష్ణయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సుధర్మేంద్రతీర్థుల ఆరాధన

**మంత్రాలయం జనవరి 18(ఆంధ్రజ్యోతి):** వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి పూర్వపు పీఠాధిపతి సుధర్మేంద్రతీర్థుల ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో సుధర్మేంద్రతీర్థుల మూల బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. పీఠాధిపతి మహామంగళహారతులు ఇచ్చారు. అనంతరం సుధర్మేంద్రతీర్థుల ప్రవచనాలు వివరించారు. మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ పాల్గొన్నారు.

### రోడ్డు పనులు అడ్డగించిన వారిపై కేసు నమోదు

**ఎమ్మిగనూరు రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** మండలంలోని గార్లదిన్నె గ్రామంలో సీసీ రోడ్డు పనులు అడ్డగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గార్లదిన్నె గ్రామానికి ప్రభుత్వం సీసీ రోడ్డును ఏర్పాటు చేసిందన్నారు. అయితే రోడ్డు పనులు వేసేందుకు వెళ్లిన అధికారులను పనులు చేయకుండా అడ్డగించారన్నారు. పనులను అడ్డగించిన ప్రకాశం, శాంతప్పలతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

## గాజుల గలగలలు

### ● జాతరలో మగువల సందడి ● కిటకిటలాడిన గాజుల అంగళ్లు



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు, జాతరలో అమ్మకానికి సిద్ధంగా కుంకుమ

**ఎమ్మిగనూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు జాతరలో మట్టిగాజులు మగువలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. మహిళలు తమ అలంకరణ వస్తువులను కొనేందుకు చుట్టుముట్టు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి రావడంతో తేరుబజారులోని గాజుల అంగళ్లు కిటకిటలాడాయి. ప్రధానంగా ఎంతో కాలంలో సాంప్రదాయంగా వస్తున్న జాతరలో తమ ఆడపడుచులకు కొత్త బట్టలతో పాటు కుంకుమ, గాజులు కొనివ్వడం ఆనవాయితీ. ఈ ఆనవాయితీని అనేక మంది కుటుంబీకులు తమ ఆడపడుచులను జాతరకు తీసుకొచ్చి ఎంచక్కా గాజులు తొడిగించడం కనిపించింది. అలాగే పసుపు, కుంకుమలు సైతం కొనిస్తూ కనిపించారు. తమ చిన్నారులకు కూడా గాజులను తొడిగించే సాంప్రదాయాన్ని పాటించడం విశేషం. అలాగే ఇటీవల కాలంలో వచ్చిన అధునాతనమైన ప్లాస్టిక్ గాజులు, గోట్లు, రింగులు, రోల్డ్ గోల్డ్ చెవి కమ్మలు, వివిధ రకాల అందమైన రోల్డ్ గోల్డ్ ఆభరణాలను మహిళలు, యువతులు, చిన్నారులను ఆకట్టుకుంటున్నాయి. జాతరలో ధర్మవరం కుంకుమ, కదిరి కుంకుమ, మహారాష్ట్ర, కుంకుమ, అనంతపురం కుంకుమలను వ్యాపారులు అమ్మకాలకు ఉంచారు. అలాగే తమ పూజ కోసం విభూతి పండ్లు కొనుగోలు చేయడం కనిపించింది.

## ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్

### పొరకలు పట్టి శుభ్రం చేస్తున్న నాయకులు, అధికారులు

**మంత్రాలయం జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. శనివారం మంత్రాలయంలోని రాఘవేంద్రపురంలో ఎంపీడీవో శోభారాణి, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి, గ్రామ కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన పారిశుధ్య కార్మికులతో కలిసి పొరకలు చేతపట్టి కాలనీలను శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌ను పాటించి చెత్త చెద్దారాన్ని వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరానలు పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాకేష్ రెడ్డి, చావిడి వెంకటేశ్, లక్ష్మయ్య, ఎస్ఎం గోపాల్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, గోపాల్, అశోక్ రెడ్డి, డిసీ తిమ్మప్ప, మేకల వెంకటేశ్, మేకల లక్ష్మన్న, రఘు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: డీఈవో**

**కోసిగి:** స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం దుద్ది, కోల్‌మాన్‌పేట గ్రామ పంచాయతీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో శామ్యూల్ పాల్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో చంద్రశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, పంచాయతీ కార్యదర్శి రామరాజు, వ్యవసాయ అధికారి వీరేష్ పాల్గొన్నారు.

● కోసిగి మేజర్ పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలోభాగంగా కోసిగిలోని 9వ వార్డు చౌడేశ్వరి దేవాలయం వద్ద ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది సచివాలయ సిబ్బందితో కలిసి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాణిక్యరాజు, హోళగుంద కోసిగయ్య, రాజేష్ పాల్గొన్నారు.

**కౌతాళం:** స్వచ్ఛ హీ దివాస్ కార్యక్రమం ద్వారా మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో గ్రామాలను చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దవచ్చని ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. మండలంలో అన్ని పంచాయతీలలో ఆయా గ్రామ సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ హీ దివాస్ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ యోగేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు, గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్‌లు పాల్గొన్నారు.

**ఎమ్మిగనూరు టౌన్:** పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి,ఆర్‌అండ్‌బీ కార్యాలయాలల్లో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెంటెంట్ డాక్టర్ సుధా, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బాలాజీ కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ చిరంజీవి,డాక్టర్ రవికుమార్, దొరబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మంత్రాలయంలో స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్న రాఘవేంద్రరెడ్డి


కోల్‌మాన్‌పేటలో..

## బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు


కూరగాయల వ్యాపారులకు హెచ్చరికలు చేస్తున్న డీఎల్‌పీవో

**గోనెగండ్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** గ్రామీణ ప్రాంతాల ప్రజలు, వ్యాపారులు ఇతరులు బహిరంగ ప్రదేశాలలో చెత్తను పారవేస్తే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో నూర్జహాన్ ఎంపీడీవో మణిమంజరి అన్నారు. శనివారం గోనెగండ్లలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ సందర్భంగా గ్రామంలోని వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల కలిగే లాభాలను ప్రజలకు వారు వివరించారు. కార్యక్రమంలో గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, శానిటరీ ఇన్‌ఫెక్టర్ మలాంగ్ బాషా, అనిల్, సుభాన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా బంధమ్మవ్వ దేవి కుంభోత్సవం

**కౌతాళం, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** మండలంలోని సులేకేరి గ్రామంలో వెలసిన గ్రామ దేవత బంధమ్మవ్వ దేవి కుంభోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. సాయంత్రం గ్రామ మహిళలు కలశాలతో ఉరేగింపుగా బయలుదేరి అమ్మవారికి కుంబాలతో అభిషేకాలు చేపట్టారు.


అమ్మవారికి కుంభాలు తీసుకెళ్తున్న భక్తులు